


శరణు.. శరణు..

● అధికార పార్టీకి వలంటీర్లే దిక్కా..? ● నవరత్నాలు ఏమైనట్లు..? ● మందీమార్బలం ఎక్కడ..?
● మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమయ్యారు..? ● వలంటీర్లకు సాగిలపడుతున్న అధికార పార్టీ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, రోజా, బుగ్గన రాజేంద్రనాథరెడ్డి వంటి హేమా హేమీలు ఉన్న రాష్ట్ర మంత్రివర్గం. 151 మంది ఎమ్మెల్యేలు, దాదాపు 35 మంది వరకు పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డితో కలిపి వందల సంఖ్యలో సొంత సామాజిక వర్గానికి చెందిన సలహాదారులు, చెప్పింది.. చెప్పినట్లు విని తూచా పాటిస్తూ.. ఎస్ బాస్ అనే ఎందరో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు కనికట్లు చేయగల సోషియల్ మీడియా సైన్యం.. ఇసుక, మట్టి, అమ్ముకుని, ప్రభుత్వ భూములు ఆక్రమించి, ప్రైవేటు భూముల్లో సైతం తలదూర్చి.. వందల కోట్లు వెనకేసిన నాయకులు, నవరత్నాల అమలు, గత ఐదేళ్లలో రాష్ట్రంలో తెచ్చిన పరిశ్రమలు, ఉపాధి కల్పన చేసినట్లు చెప్పుకుంటున్న అభివృద్ధి.. ఇవన్నీ రాబోయే ఎన్నికల సమరంలో అధికార వైసీపీకి ప్రధాన అస్త్రాలుగా ఉంటాయని ఆ పార్టీ నేతలు భావిస్తూ వచ్చారు.


అయితే ఇవేవీ తమ పార్టీని గెలుపు బాటలో నడిపించవనే భయం ముఖ్యమంత్రికి పట్టుకున్నట్లుగా ఉంది. లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులు పొందిన వాళ్లను కాదని.. ముఖ్యమంత్రే వార్డు/గ్రామ వలంటీర్లను శరణు కోరుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ బహిరంగ సభలు జరిగినా.. రాబోయే ఎన్నికల్లో తన బలం, సైన్యం వలంటీర్లే అని చెప్తున్నారు. దీనిపైన రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

నవరత్నాలు ఏమైనట్లు..?

జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. వీటికి ఎక్కడా లేని ప్రాధాన్యతను ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో ఈ పథకాలు ఎంతో కొంత అమలు జరిగినా.. తర్వాత లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం అనేక కఠిన ఆంక్షలు చేర్చింది.. ఫలితంగా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. పాద యాత్ర సందర్భంగా జగన్ చెప్పిన మాటలకు, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నవరత్నాల అమలు సమయంలోనూ ఎంతో వ్యత్యాసం కనిపించింది. ఐదేళ్ల పాలనలో అమ్మఒడి పథకాన్ని నాలుగేళ్లు మాత్రమే అమలు చేశారు. అదే సమయంలో ఈ పథకానికి లబ్ధిదారుల ఎంపికకు కరెంటు బిల్లులు, సొంత ఇళ్లు ఉండకూడదు, కారు ఉండకూడదు అనే నిబంధనలతో నిజమైన అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేయలేదు. దాదాపు నవరత్నాలలో ప్రతి పథకానికి ఇటువంటి నిబంధనలే పెట్టారు. పెన్షన్ల పెంపు విషయంలో ప్రభుత్వం నాలుక ఎన్ని మడతలు పెట్టిందో.. లెక్కపెట్టడమే కష్టం. టీడీపీ పాలనలో పెన్షన్ రూ.2 వేలు ఇచ్చేవాళ్లు. తాము అధికారంలోకి వస్తే.. రూ.3 వేలు ఇస్తానన్న జగన్ అధికారంలోకి రాగానే మాట మార్చేశాడు. ఏటా రూ.250 చొప్పున.. ఇప్పటికి రూ.3వేలు చేశాడు. ఇలా ప్రభుత్వం లబ్ధిదారుల విషయంలో అనుసరించిన వైఖరి వల్ల నవరత్నాలు జగన్ ప్రభుత్వానికి పెద్దగా ఉపయోగపడలేదనే అభిప్రాయం సర్వత్రా ఉంది.

మందీ మార్బలం పనిచేయలేదా ?

అధికార వైసీపీలో మహా మహులైన రాజకీయ నాయకులు, ఎంతో రాజకీయ అనుభవం, నేపథ్యం ఉన్న నాయకులు ఉన్నట్లు ఆ పార్టీ నేతలు గొప్పలు చెబుతుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. పార్టీకి వైఎస్.జగన్ పెద్ద బ్రాండ్ అని డబ్బా కొడుతుంటారు. దీనికి తోడు ఐప్యాక్ టీం ప్రభుత్వానికి ఎప్పుడూ జాకీలు వేసి పైకి లేపుతూనే ఉంటుంది. సలహాదార్లు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు, ప్రతిపక్షం పైకి ఒంటికాలిమీద వెళ్లే నాయకులు, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు.. ఆబ్బో ఇలా చెప్పుకుంటూ.. పోతే జాబితా పెద్దదే అవుతుంది. ఈ జాబితా అంతా కూడా రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చే పరిస్థితి కనిపించడం లేదని అర్థమవుతోంది.



ఇక వలంటీర్లే దిక్కా..?

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసింది. జిల్లాలో 8376 మంది వలంటీర్లను ఏర్పాటు చేసింది. అందులో ప్రస్తుతం 8528 మంది పనిచేస్తున్నారు. వీళ్ల ద్వారా నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేయించే వాళ్లు. అయితే రానురాను.. ప్రతి ఇంట్లోని సమాచారం వలంటీర్ల సేకరించడం మొదలు పెట్టారు. ఆధార్‌కార్డులు, బ్యాంకు పాసుపుస్తకాలు, ఆస్తుల వివరాలు, వాళ్లు ఏ పార్టీకి మద్దతుదారులు వంటి వ్యక్తిగత సమాచారాన్ని కూడా సేకరించారు. అంతేకాకుండా.. అధికార పార్టీ తరఫున ప్రచారం కూడా చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు కానుకల పంపిణీకి కూడా అధికార పార్టీ వలంటీర్లను వాడుకుంది. ఇంకా కొన్ని చోట్ల తమ పార్టీల ఓటర్ల ఓట్లు తొలగించేందుకు కూడా వలంటీర్లను అధికార పార్టీ వినియోగిస్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. దీంతో కొందరు వలంటీర్లను ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు సస్పెండు చేశారు. ఒకమాటలో చెప్పాలంటే.. అధికార పార్టీ పూర్తిగా వలంటీర్లపైనే ఆధారపడింది.

ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఓ స్వచ్ఛంద సేవా సంస్థ చేసిన ఫిర్యాదుతో వలంటీర్లను ఎన్నికల విధులతో పాటు.. సంక్షేమ పథకాల అములులో కూడా దూరంగా ఉంచమని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలతో ఖంగుతిన్న అధికార పార్టీ వలంటీర్ల సేవలు దొడ్డిదారిలో వాడుకునేందుకు నిర్ణయించింది. దీంతో అధికార పార్టీ వలంటీర్లను తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి తమతో పాటు ఎన్నికల ప్రచారానికి తిప్పుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 529 మంది తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. 16 మందిని ఎన్నికల సంఘం సస్పెండు చేసింది. రాజీనామాలు రాబోయే రోజుల్లో మరిన్ని పెరిగే అవకాశం ఉంది. ఈ సంఘటనల నేపథ్యంలో.. ఎంతో గొప్పగా పాలన చేశామని చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, సలహాదారులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఇంకా ముఖ్యమైన నాయకులు ఉండగా.. వలంటీర్లే దిక్కయ్యారా ? అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



175 సీట్లలో నేనే పోటీ

"నాకు ఒక అవకాశం ఇవ్వండి.. నన్ను చూసి ఓటెయ్యండి.. 175 స్థానాల్లోనూ.. నేనే పోటీలో ఉన్నాననుకోండి.. చంద్రబాబు కంటే.. మెరుగైన పాలన అందిస్తా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం చేస్తా.." ఇవీ గత ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నమాటలు..

మరొక్కసారి నాకు అవకాశం ఇవ్వండి..

"130 సార్లకు పైగా బటన్ నొక్కాను.. సాయం పొందిన వాళ్లు నాకు ఓటేయ్యండి.. నన్ను గెలిపించాల్సిన బాధ్యత వలంటీర్లపైనే.." ఇవీ ఇప్పుడు ఎన్నికల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటున్న మాటలు..

పై రెండు మాటలను గమనిస్తే.. రాబోయే ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉండబోతోందో..? ముఖ్యమంత్రికి ఇప్పటికే స్పష్టంగా అర్థమైపోయిందని పలువురు రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

జిల్లాలో నిరంతరం నిఘా

● ఇప్పటి వరకు రూ.5.74 కోట్ల విలువైన నగదు, సిల్వర్, మద్యం, గంజాయి సీజ్
● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్
● ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం
● ఎస్పీ కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమంగా తరలించే నగదు, మద్యం, గంజాయి వస్తువులపై నిరంతర నిఘా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ, పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్, ఇన్‌కమ్‌ట్యాక్స్ కమర్షియల్ ట్యాక్స్, ఎన్నికలకు సంబంధించిన వివిధ విభాగాల నోడల్ అధికారులు తదితరులతో ఎస్పీ కృష్ణారావుతో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటర్లందరూ నిర్భయంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన వాతావరణం ఏర్పర్చడం అధికారుల అందరి బాధ్యత అని, జిల్లాలో మోడల్‌కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.5.74 కోట్ల విలువైన నగదు, సిల్వర్, మద్యం, గంజాయి తదితరాలు సీజ్ చేసినట్లు తెలిపారు. సీజర్ మేనేజ్మెంట్‌లో అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని పారదర్శకంగా ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఫ్లాయింగ్ స్క్వాడ్‌లు విస్తృతంగా పర్యటించాలన్నారు. నగదు వస్తువులను సీజ్ చేసేటప్పుడు నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని, ఎక్కడైనా అనధికారికంగా రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తున్నప్పుడు వారి వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోతే సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి నివేదించాలన్నారు. ఆ నగదుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో ఎవరిని సంప్రదించాలన్న విషయాన్ని కూడా సంబంధిత వ్యక్తులకు తగిన సమాచారంతో పాటు ఫోన్ నెంబర్లు కూడా ఇవ్వాలని సూచించారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ విలువైన నగదు లేదా వస్తువులను గుర్తిస్తే ఈఎస్ఎంఎస్‌లో నమోదు చేసి వివరాలను ఆదాయ పన్ను, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు పంపించాలని ఆదేశించారు. మద్యం అమ్మకాలపై దృష్టి పెట్టి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల కోడ్ వచ్చిన పిదప ఇప్పటి వరకు 767 లైసెన్సుడ్ వెపన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీస్‌శాఖ పరంగా 232 లొకేషన్స్‌లోని 398 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తగిన బందోబస్తు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాకు చేరుకున్న మూడు కేంద్ర కంపెనీ బలగాలతో అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే 104 ఫ్లాగ్ మార్చ్ చేశామని, అలాగే 107, 110 సీఆర్‌సీ కింద 828 కేసులు నమోదు చేసి 5276 మందిని బైండోవర్ చేసుకున్నట్లు తెలిపారు. పటిష్టమైన బందోబస్తుతో ఎన్నికల విజయవంతానికి పోలీసుశాఖ పరంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఆర్‌వో సత్యనారాయణరావు, ఇన్‌కమ్‌ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వివిధ నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి సమక్షంలో 40 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వాల్మీకులకు కండువా కప్పుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, పక్కన మల్లెల శ్రీవాణి తదితరులు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 12: రాజంపేట పట్టణంలోని బోయపాలెం ప్రాంతంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సమక్షంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, సీనియర్ బీసీ నాయకులు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మల్లెల సుబ్బరాయుడు, యువ నాయకులు మల్లెల సురేంద్ర, ఆధ్వర్యంలో బోయపాలెం వాల్మీకి సంఘం నేతృత్వంలో 40 కుటుంబాల వాల్మీకిసంఘ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం బోయపాలెంలో ఇండియన్ గ్యాస్ రాధా, మేకల కృష్ణమూర్తి, చికెన్ రమణ, శంకరయ్య ఆధ్వర్యంలో 40 కుటుంబాల వారిని బాలసుబ్రమణ్యం టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులు భాస్కర్, ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లబోతుల జ్యోతీశ్వర బాబు మృతికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, టీడీపీ సీనియర్ నాయకులు మల్లెల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పెద్దఎత్తున టీడీపీలో వాల్మీకులు చేరడం ఆనందదాయకమన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తానని, రాజంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ మల్లెల శ్రీవాణి మాట్లాడుతూ సుగవాసి బాలసుబ్రమణ్యంను ఎమ్మెల్యేగా, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

మేమూ పులివెందుల బిడ్డలమే

● ఒకవైపు వైఎస్సార్ బిడ్డ... మరోవైపు హంతకుడు
● జగన్ పులివెందుల పిల్లి
● పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
● పులివెందుల నియోజకవర్గంలో షర్మిలకు జనం జేజేలు

పులివెందుల, ఏప్రిల్ 12: "మేమూ పులివెందుల బిడ్డలమే. వైఎస్సార్ బిడ్డగా కొంగుచాచి అడుగుతున్నా.. న్యాయనిర్ణేతలు మీరే. ఒకవైపు వైఎస్సార్ బిడ్డ, మరోవైపు వివేకా హత్య నిందితుడు అవినాశ్‌రెడ్డి.. ఎవరు కావాలో మీరే తేల్చండి" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. కడప ఎంపీ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల న్యాయ్‌యాత్ర పేరిట బస్సుయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం వేంపల్లె నుంచి వేముల, పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల మీదుగా బస్సు యాత్ర సాగింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో పులివెందులలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద (పూలంగళ్ల సర్కిల్) ప్రజలనుద్దేశించి షర్మిల మాట్లాడారు. వీధిలైట్లు వెలగకపోవడంతో ఆమె ఘాటుగా స్పందించారు. మామూలుగానే లైట్లు ఉండవా లేక మేము వస్తున్నామని లైట్లు తీసేశారా అని ప్రశ్నించారు. కాగా చిన్నాన్న విషయంలో అన్యాయం జరిగిందని, వివేకాను హత్య చేసి ఐదేళ్లు అయినా.. ఈరోజు వరకు న్యాయం జరగలేదన్నారు. చంపించింది అవినాశ్‌రెడ్డి అని సీబీఐ చెబుతున్నా కూడా స్వయానా ముఖ్యమంత్రి తన అధికారాన్ని అడ్డం వేసి మరీ కాపాడుతున్నారన్నారు. జగనన్నను సూటిగా ప్రశ్నిస్తున్నా జనం మీకు ఓట్లు వేసింది ఎందుకు అన్నారు. పులివెందుల పులి అన్నారు.. జగన్ మోహన్‌రెడ్డి బీజేపీకి, మోదీకి పిల్లిలా మారారన్నారు. బీజేపీకి ఎందుకు బానిసయ్యారని ప్రశ్నించారు. వేంపల్లెలో డాక్టర్ సునీత మాట్లాడుతూ.. వైఎస్ వివేకానంద రెడ్డికి వేంపల్లెతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తన తండ్రిని ఘోరంగా చంపారని, చంపిన వారికి శిక్ష పడేలా చేస్తున్న న్యాయ పోరాటానికి మీ మద్దతు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కిక్కిరిసిన నాలుగురోడ్ల కూడలి

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన బస్సు యాత్ర వేంపల్లెలో విజయవంతమైంది. సొంత నియోజకవర్గంలోని వేంపల్లె నుంచి శుక్రవారం బస్సుయాత్ర ప్రారంభించారు. మధ్యాహ్నం 11గంటల ప్రాంతంలో స్థానిక నాలుగురోడ్ల కూడలిలో కిక్కిరిసి ఉన్న జనాన్ని ఉద్దేశించి షర్మిల మాట్లాడారు. వేంపల్లెలో షర్మిల బస్సు యాత్రకు సీపీఐ, ఏఐటీయూసీ, ఆమ్‌ఆద్మీపార్టీ, భవన నిర్మాణ కార్మిక సంఘం తదితరులు మద్దతుగా మాట్లాడారు. సింహాద్రిపురం, లింగాలలోనూ జనం పెద్దఎత్తున హాజరయ్యారు. పులివెందుల పూలంగళ్ల కూడలిలో ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చారు. మిద్దెలపైకి ఎక్కి మరీ అక్కాచెల్లెళ్ల ప్రసంగాన్ని విన్నారు.



వేంపల్లెలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల, పక్కన డాక్టర్ సునీత

ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలదే హవా

● ప్రథమ సంవత్సరంలో 53 శాతం..
ద్వితీయ సంవత్సరంలో 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత

రాయచోటిటౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో అమ్మాయిలదే హవా కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 53 శాతం, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 69శాతం ఉతీర్ణత సాధించినట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 137 ప్రభుత్వ జూనియర్, ఎయిడెడ్ బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ కళాశాలలు, ప్రైవేటు అన్ ఎయిడెడ్, హైస్కూల్ ప్లస్ కళాశాలలు ఉండగా అందులో ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్‌తో కలిపి 14,731 విద్యార్థులకు గానూ 14,023 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అందులో 7501 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 11,907 మంది విద్యార్థులకు గానూ 11,226 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 7545 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 79 శాతం ఉత్తీర్ణత సాధించగా, కేజీబీవీ జూనియర్ కళాశాలలో 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల్లో 60 శాతం ఉత్తీర్ణత వచ్చింది. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లా పరిధిలోని మదనపల్లె బాలికల జూనియర్ కళాశాలకు చెందిన తాహూర సమర్ ఎంపీసీ గ్రూపులో (979/1000) సాధించగా, గీతామాధురి బైపీసీ గ్రూపులో (964/1000) సాధించింది. అలాగే రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జె.కుష్బూర్ హెచ్‌ఈసీ విభాగంలో (964/1000) సాధించగా, మదనపల్లె బాలికల కళాశాలకు చెందిన సమీరా కౌషర్ విభాగంలో (951/1000) మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ విభాగాల్లో బాలికలే అత్యధిక మార్కులు సాధించడం పట్ల ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య ఆయా కళాశాలల, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

గజవాహనంపై పట్టాభిరాముడి వైభవం

● వేడుకగా ధ్వజారోహణం ● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ధ్వజారోహణం కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి

వాల్మీకిపురం, ఏప్రిల్ 12: వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, విశేష పూజలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తజనం నడుమ ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగదోష నివారణ, సంతాన ప్రాప్తి కోసం మహిళలకు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణలకు స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం ఊంజల్ మండపంలో పట్టాభిరాముడి ఊంజల్‌సేవ కన్నుల పండువగా సాగింది. రాత్రికి విశేష అలంకరణలతో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని గజవాహనంపై ఆశీనులు గావించారు. మహిళల చలిపిండి దీపారాధనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రామయ్యను గజవాహనంపై పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ప్రముఖులు వాహన సేవలో పాల్గొనగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీరామ ప్రతమాల భక్తులు వాహనసేవలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా రెండోరోజు శనివారం ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి హనుమంత వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి.



గజవాహనంపై ఊరేగుతున్న సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడు

ప్రతిష్ఠాత్మకంగా కోదండరాముని బ్రహ్మోత్సవాలు

● 22న సీతారాముల కల్యాణం
● టీటీడీ ఈవో ధర్మారెడ్డి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 12: ఆంధ్ర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండరాముని బ్రహ్మోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో ఏ.వి.ధర్మారెడ్డి అన్నారు. ఇందులో భాగంగా సీతారామ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌తో కలిసి శుక్రవారం ఈవో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పీఏసీలోని సమావేశ హాలులో బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఏప్రిల్ 22న సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరిగే సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయలన్నారు. కల్యాణానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, విరివిగా అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటర్లలోనూ, గ్యాలరీలలో ఉన్న భక్తులకు ప్రసాదాల పంపిణీకి అవసరమైనంత మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని, భద్రత, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు, కంట్రోల్ రూం, సీసీ కెమెరాలు, కల్యాణోత్సవం సందర్భంగా విద్యుద్దీకరణ అంశాలు, అగ్నిమాపక వాహనం, వైద్య ఆరోగ్య శాఖ వారిచే వైద్య శిబిరం, హెల్ప్ డెస్కుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ ఏడాది భక్తులకు కావాల్సిన అన్ని రకాల వసతులను శాశ్విత ప్రాతిపదికన నిర్మించినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ ఏప్రిల్ 15వ తేదీలోపు బ్రహ్మోత్సవాల పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ వేదిక వద్ద గ్యాలరీలు, పటిష్టమైన బారికేడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తుల కోసం వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు పారా మెడికల్ సిబ్బంది, మందులు, అంబులెన్సులు, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ గణేశ్‌కుమార్, కడప మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఎస్‌వీబీసీ సీఈవో షణ్ముకకుమార్, డీఆర్‌వో గంగాధర్‌గౌడ్, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, కడప ఆర్డీవో మధుసూదన్‌రావు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

శాస్త్రోక్తంగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

ఆలయంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏప్రిల్ 17-25 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అందులో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చిఆకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర మిశ్రమాన్ని రామాలయం గోడలు, పైకప్పు పూజా సామగ్రి, రామాలయం ధ్వజ స్తంభాలకు సంప్రోక్షన నిర్వహించి శుద్ధి చేపట్టారు. అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. కాగా ఈ కార్యక్రమాన్ని ఉదయం 8 గంటల నుంచి చేపడుతున్నట్లు ముందుగా టీటీడీ అధికారులు సమాచారం ఇచ్చారు. కానీ టీటీడీ ఈవో ధర్మారెడ్డి పర్యటన నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి రామాలయంలో ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టడంతో... సంరక్షణలో పాల్గొనాలనుకున్న భక్తుల నుంచి విమర్శలు ఎదురయ్యాయి.

కల్యాణోత్సవ సమయంలో మార్పు

కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవ సమయంలో మార్పులు చేపట్టారు. గత కొన్నేళ్లుగా రామాలయంలో రాత్రి 8 గంటల నుంచి 10.30 గంటల సమయంలో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. టీటీడీ పాలక మండలి నిర్ణయం మేరకు సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల మధ్య నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణోత్సవానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. రాత్రివేళ పండు వెన్నెలలో నిర్వహిస్తారు. ఈ ప్రాంతవాసులకు కోదండరాముని కళ్యాణ ఉత్సవం ఓ పండుగలా కొనసాగుతుంది.



కల్యాణ వేదిక ప్రాంతాలను పరిశీలిస్తున్న దృశ్యం



ఆలయ శుద్ధి చేపడుతున్న టీటీడీ అర్చకులు, అధికారులు

దిక్సూచి
DIKSUCHI

విదేశాల్లో చదువుకు కీలకం
లెటర్ ఆఫ్ రికమండేషన్

మంచోడని మన గురించి నలుగురూ చెప్పుకోవాలని అనుకోవడం సర్వ సాధారణం. సగటు మానవుడి సాధారణ కోర్కెగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే దీనికి సంబంధించిన ఆధునిక రూపమే లెటర్ ఆఫ్ రికమెండేషన్(ఎల్ఓఆర్). ఇక్కడ కాన్సెప్ట్ మంచోడని కాదు, విదేశీ విద్యా సంస్థలో సీటుకు అర్హుడు అని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అది తను చదువుకున్న సంస్థకు చెందిన ప్రొఫెసర్ల వంటి వారు అన్నమాట. మరీ ముఖ్యంగా విదేశాల్లో చదువుకోవాలంటే అవసరమైన పత్రాల్లో ఇది కీలకమైనది అని కూడా చెప్పవచ్చు.



విదేశాల్లో చదవాలని భావించే అభ్యర్థి కేరెక్టర్, డెడికేషన్, అకడమిక్ ఆప్టిట్యూడ్‌కి సంబంధించి విలువైన విషయాలను ఈ లెటర్ తెలియజేస్తుంది. కాలేజీ ప్రొఫెసర్లు, ఎంప్లాయర్లు మెంటార్లు, విభాగాధిపతులు ఇచ్చే ఈ లెటర్లతో అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది, పోటీతత్వం కూడా తెలుస్తుంది. స్ట్రక్చర్డ్ ఫార్మేట్‌కు తోడు సరైన ఉదాహరణలతో ఉండే లెటర్ ఒక వ్యక్తి స్థిరత్వం తదితరాలను తెలియజేస్తుంది. అకడమిక్ కెరీర్‌లో అభ్యర్థి సాధించిన గ్రేడ్స్, క్రెడిట్స్‌కు మించిన విషయాలు ఈ లెటర్‌లోనే వెల్లడి అవుతాయని కూడా చెప్పవచ్చు. కోరుకున్న కోర్సులో సీటు లభించేందుకు తోడ్పడుతుంది. అభ్యర్థికి ఉన్న విశ్వసనీయత, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా సీటు పొందడానికి ఉన్న అవకాశాలు పెరుగుతాయి. పొందికగా తీర్చిదిద్దిన లెటర్ ఆఫ్ రికమండేషన్ నిజానికి విదేశాల్లో చదవాలని ఆకాంక్షించే అభ్యర్థి లక్ష్య సాధనలో ఇతోధికంగా తోడ్పడుతుంది.

ఎవరితో... ఎందుకు

లెటర్ ఆఫ్ రికమండేషన్‌ను ఎవరితో రాయించుకోవాలి అన్నది ఒక ప్రశ్న. వివిధ వర్గాల ద్వారా సమీకరించిన సమాచారాన్ని మదించుకుని మరీ ఆ వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. అలా సిఫార్సు చేయించుకోదగ్గ వ్యక్తుల్లో ప్రొఫెసర్ల నుంచి డిపార్ట్‌మెంట్ హెడ్ లేదా డీన్, ఉద్యోగం చేసి ఉంటే ఎంప్లాయర్, పరిశోధన పర్యవేక్షకుల వరకు అందరూ వస్తారు. మెంటార్లు, కోచ్‌లు, గైడెన్స్ కౌన్సెలర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. అభ్యర్థి నాయకత్వ పటిమ, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్ పర్సనల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విషయాలను విస్తారంగా, విపులంగా, వివరంగా వీరు మాత్రమే ప్రస్తావించగలుగుతారు.

అకడమిక్, నాన్ అకడమిక్ అంశాల సమ్మిళితంగా ఉన్న రికమండేషన్ లెటర్, అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను సమగ్రంగా తెలియజేయగలుగుతుంది. రికమండ్ చేసే ప్రతి వ్యక్తి తనదైన కోణంలో అభ్యర్థి సదరు కోర్సు చేసేందుకు ఎలా, ఎందుకు అర్హుడో తెలియజేస్తారు. లెటర్ మాత్రం వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యాసంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

కరెక్ట్ ఫార్మేట్

ఈ లెటర్‌కు సంబంధించినంతవరకు కోర్ ఎలిమెంట్ అంతా ఒక్కటే. ఒక అభ్యర్థి సీటు పొందేందుకు అవసరమైన సిఫార్సు అందులో ఉంటుంది. అయితే కోర్సును బట్టి చిన్నపాటి మార్పులు లెటర్ రాసే తీరులో ఉంటుందని గమనించాలి. ఫార్మేట్, సిఫార్సు చేసే వ్యక్తి - అందుకునే వ్యక్తి కాంటాక్ట్ సమాచారం తదితరాలు యథాతథం. లెటర్‌ను ఉద్దేశించిన వ్యక్తిని గౌరవప్రదంగా సంబోధించడం సహా సాధారణ విషయాలకు తోడు అందులోని కంటెంట్ అభ్యర్థితో తనకు ఉన్న సంబంధాన్ని తెలియజేయాలి. తనకు ఎంత కాలం నుంచి తెలుసు, ఇద్దరి మధ్య ఉన్న బాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకరకంగా అభ్యర్థి వ్యక్తిగత విషయాలకు సంబంధించి తనది భరోసా అన్న విధంగా ఉండాలి.

లెటర్ బాడీలో అభ్యర్థి అర్హతలు, సాధించిన విజయాలు, సంబంధిత అనుభవం, కోర్సులో చేర్చుకునేందుకు అర్హుడు అంటూ తెలియజేసే ఉదాహరణలు ఉండాలి. ఇదంతా చదివితే అభ్యర్థికి ఉన్న బలాలు, నైపుణ్యాలు, కేరక్టర్ తెలియడమే కాదు, ఎంపిక చేసేందుకు దోహదపడాలి. అభ్యర్థి విశ్వసనీయతను పెంచాలి. అలాగే లెటర్ చివరి పేరాలో ముందు చెప్పిన అంశాలను క్రోడీకరించాలి. ఇంకేమైనా సమాచారం అవసరమైతే అది కూడా అందించేందుకు తాను సిద్ధమని కూడా తెలియజేయాలి. లెటర్ రాసిన వ్యక్తి సంతకం, కాంటాక్ట్ సమాచారం చివర్లో ఉండాలి. ప్రొఫెషనల్ సైన్-ఆఫ్‌తో మొత్తం పద్ధతిగా ఉండాలి.

ఈ ఆరూ ముఖ్యం

- లెటర్ ఆఫ్ రికమండేషన్స్ ఎన్ని సమర్పించినప్పటికీ అవి అభ్యర్థిలో ఉండే వివిధ కోణాలను చెప్పగలగాలి. విజయాలు, పర్సనాలిటీ అకడమిక్ లేదా ఎక్స్‌ట్రాకరిక్యుల్ సక్సెస్‌ను తెలియజేయగలగాలి. ఉదాహరణకు పరిశోధన నైపుణ్యాలు ఒక లెటర్‌లో ఉంటే మరొక దానిలో తరగతి గదిలో అభ్యర్థి కనబరిచిన సామర్థ్యాలను తెలియజేయాలి.
- రికమండ్ చేసే వ్యక్తికి మీరు తెలిసినప్పటికి సంబంధిత బేసిక్ సమాచారాన్ని అభ్యర్థి అందించాలి. సీవీ, అకడమిక్ జీపీఏలు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, లెటర్ సబ్మిషన్‌కు డెడ్‌లైన్ తదితరాలు తెలియజేయాలి. అప్పుడే సదరు రికమెండర్ తన సిఫార్సును చక్కగా డ్రాఫ్ట్ చేయగలరు.
- ఆ లెటర్‌లో ప్రత్యేకించి కొన్ని సందర్భాలు, ఉపాఖ్యానాలు కూడా ఉండాలి. అభ్యర్థి లక్షణాలను తెలియజేసే విధంగా అవి ఉండాలి. లక్షణాలు, నైపుణ్యాలు తదితరాలను కేవలం ధ్రువీకరణలతో సరిపెట్టకూడదు. వాటికి సరైన ఉదాహరణలనూ జోడించాలి. రీసెర్చ్ ప్రాజెక్టుల్లో అనుభవాలు లేదంటే చోటుచేసుకున్న చర్చలను కూడా కలిపితే అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది.
- ఆ లెటర్‌లో అభ్యర్థికి సంబంధించిన బలాలకు తోడు అకడమిక్ ప్రోగ్రెస్, డెవలప్‌మెంట్‌కూ తగు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ అంశాల్లో కచ్చితత్వాన్ని అడ్మిషన్ కమిటీ ఎవాల్యుయేట్ చేస్తుంది. బలహీనతలను ఎలా అధిగమిస్తారన్నది కూడా చూస్తుంది.
- లెటర్ డ్రాఫ్టింగ్‌లో సమతుల్యత పాటించాలి. అస్సలు ఏమీ లేకపోవడం లేదంటే పెద్ద ఎత్తున విషయాలను కుమ్మరించడం... రెండూ పనికిరావు. ప్రొఫెషనల్ అయినప్పటికీ పర్సనలైజ్డ్ సిఫార్సులకు అడ్మిషన్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుంది. అందుకని ప్రతి లెటర్ దేనికది యూనిక్‌గా ఉండాలి. బేసిక్ ఫార్మాట్ నుంచి పక్కకు తప్పకుండానే కంటెంట్ తదితర విషయాల్లో తగు జాగురూకత పాటించాలి. మొత్తమ్మీద బ్యాలెన్స్ తప్పకుండా చూసుకోవాలి.
- ప్లగారిజాన్ని తప్పించాలి. మరొక లెటర్‌కు కాపీ కారాదు. ఒరిజినల్ అనిపించాలి. కాపీని సులువుగా పట్టేస్తారు. ముందునుంచీ చెబుతున్నట్టు లెటర్ ఒరిజినల్‌గా ఉండేలా చూడాలి. అభ్యర్థిని తీసుకునేలా ఉండాలే తప్ప ఒక డూప్లికేట్ మాదిరిగా అనిపించి అసలుకే మోసం తెచ్చేలా ఉండకూడదు. అంటే కాపీ, పేస్ట్ పని మంచిది కాదని గుర్తించాలి.

ఈఎస్‌సీఐలో పీజీ డిప్లొమా

హైదరాబాద్, గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కు చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్(ఎస్‌పీజీఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎడ్యుకేషనల్ లోన్ సౌకర్యం ఉంది. మెరిట్ స్కాలర్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కూడా ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా సైన్స్ డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/ఎక్స్‌ఏటీ/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in, escihyd.org

ఎన్ఎస్‌డీలో డిప్లొమా



ప్రపంచంలోనే తొలి థియేటర్ ట్రైనింగ్ సంస్థగా 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'గా పేరుంది. 1959లో సంగీత నాటక అకాడమీ విభాగంగా ఈ సంస్థ ఆరంభమైంది. 1975లో స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ విభాగం నిధులతో ప్రస్తుతం పనిచేస్తోంది. తగు జాగ్రత్తలతో ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించిన సిలబస్, శిక్షణతో పకడ్బందీగా సంస్థను నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంస్థ డ్రమటిక్ ఆర్ట్‌లో మూడేళ్ళ కాలవ్యవధి కలిగిన డిప్లొమాకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులను యాక్టింగ్, డిజైన్, డైరక్షన్‌కు తోడు థియేటర్ సంబంధ డిసిప్లిన్స్‌లో ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కోర్సు ఇది. ఈ ఏడాది జూలై 24 నుంచి కోర్సు ఆరంభమవుతుంది. సీట్లు 32 కాగా వీటిలో మూడింటిని విదేశీ విద్యార్థులకు కేటాయించారు. హిందీ ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది.

అర్హత: ఏ డిసిప్లిన్‌లో అయినా మూడేళ్ళ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆరు వేర్వేరు థియేటర్ ప్రొడక్షన్స్‌లో పాల్గొని ఉండాలి. అందుకు తగు ప్రూఫ్‌ని సమర్పించాలి. హిందీ/ ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలి. ఈ ఏడాది జూలై 1 నాటికి వయసు 18-30 మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలకు నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: ఇది రెండు దశలుగా ఉంటుంది. ప్రిలిమినరీ ఎగ్జామ్ ఉంటుంది. ఇందులో ఎంపికైన వారికి ఫైనల్ ఎగ్జామినేషన్ వర్క్‌షాప్ ఉంటుంది. దేశంలోని వివిధ నగరాల్లో వేర్వేరు తేదీల్లో ఈ రెండూ జరుగుతాయి. హైదరాబాద్‌లో మే 27న జరుగుతుంది. వివరాలు ఎన్ఎస్‌డీ వెబ్‌సైట్‌లోనూ ఉంటాయి. తుది ఎంపిక న్యూఢిల్లీలో ఉంటుంది. జూన్ 23 నుంచి 27 వరకు అంటే అయిదు రోజులు ఉంటుంది. దీనికి పిలిచిన అభ్యర్థులకు వారి సొంత ఊరి నుంచి ట్రావెల్ ఎక్స్‌పెన్సస్‌కు తోడు డీఏ చెల్లిస్తారు. నిపుణులతో కూడిన కమిటీ వీరి ప్రతిభను పరిశీలించి తుది ఎంపిక జరుపుతుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. అందుకు మెడికల్ టెస్ట్ కూడా ఉంటుంది.

కోర్సు వివరాలు: కోర్సు కాల వ్యవధి మూడేళ్ళు కాగా ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ 20 వారాల పాటు ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్లు కామన్. చివరి మూడు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ ఉంటుంది. ఇందులో డిజైన్, డైరక్షన్‌లో మాత్రం అయిదుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9.500 చెల్లిస్తారు.

దరఖాస్తు: ఫీజు రూ.50. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మే 10

వెబ్‌సైట్: www.nsd.gov.in http://www.onlineadmission.nsd.gov.in

ఎన్‌పీసీఐఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

జాబ్ కార్నర్

ముంబయిలోని కేంద్రప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) కింది విభాగాల్లో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ: 400 పోస్టులు. (ప్రస్తుత ఖాళీలు 396, బ్యాక్‌లాగ్ ఖాళీలు 4)

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

NPCIL

వయసు: ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక: గేట్ 2022/ 2023/ 2024 స్కోర్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/N2VHWUUలో
చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం
- యశ్



ఇప్పటివరకూ పలు భారతీయ భాషల్లో రామాయణంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిల్లో ఎన్నో అభూత కల్పనలు, వక్రీకరణలు, మార్పులు చోటు చేసుకున్నాయి. క్రియేటివ్ ఫ్రీడమ్ పేరుతో రచయితలు, దర్శకులు చేసిన ప్రయోగాల వల్ల కొన్ని సినిమాలు అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. వాటన్నింటికీ భిన్నంగా నిజమైన రామాయణాన్ని వెండితెరపైకి తెచ్చేందుకు తాము సిద్ధమవుతున్నామని హీరో యశ్ చెప్పారు. ఆయన సొంత నిర్మాణ సంస్థ మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా రామాయణాన్ని నిర్మించబోతున్నారు. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇప్పటి వరకూ చాలా రామాయణాలు వెండితెరపైన వచ్చినా అందులో పూర్తిగా రామాయణం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఏది అనేది తెలియదు. కానీ మేం ఇప్పుడు అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం' అని యశ్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రామాయణం చేస్తే బాగుంటుందని నమిత్, నేను చాలా సార్లు అనుకున్నాం. కానీ అంత పెద్ద సబ్జెక్టును తీయాలంటే బడ్జెట్ సరిపోదు. అందుకు నేను కూడా సహ నిర్మాతగా చేరాను. రామాయణానికి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. దానికోసం ఎంతైనా కష్టపడతాను. అందులో ఉన్న భావోద్వేగాలు, విలువలు గురించి ప్రపంచం అంతా చాటాలి. డీఎన్ఈజీ విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా ఇప్పటివరకూ చూడని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాం' అని చెప్పారు. రామాయణం లాంటి గొప్ప ప్రాజెక్ట్‌ను ప్రపంచస్థాయి వేదికలపైకి తీసుకెళ్లాలంటే యశ్ లాంటి వారికే సాధ్యం అని నమిత్ మల్హోత్రా చెప్పారు. అయితే ఈ సినిమాలో యశ్ నటుడిగా ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని బయటపెట్టలేదు. గతంలో ఆయన రావణుడి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. రణబీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా కనిపించనున్నారని టాక్. 'కేజీయఫ్' సిరీస్‌తో హీరోగా స్టార్‌డమ్ దక్కించుకున్నారు యశ్. ప్రస్తుతం ఆయన 'టాక్సిక్' అనే చిత్రం చేస్తున్నారు.

కార్తికేయ... వాయు వేగం

కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా ప్రశాంత్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. 'భజే వాయువేగం' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. శుక్రవారం మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో క్రికెట్ బ్యాట్‌తో కార్తికేయ పరుగు తీస్తుండగా, నేపథ్యంలో కరెన్సీ ఎగురుతూ కనిపించింది. టైటిల్, పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి, సినిమా ఘన విజయం అందుకోవాలి అని మహేశ్‌బాబు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



.ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాణ సంస్థ యూవీ కాన్సెప్ట్స్ సన్నాహాలు చేస్తోంది. ఐశ్వర్యమీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'హ్యాపీడేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి రాజశేఖర్

న్యూ ఏజ్ సినిమా
దిల్‌రాజు



ఆశిష్, వైష్ణవిచైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. ఇఫ్ యు డేర్ ఉప శీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీశ్, దిల్‌రాజు సమర్పణలో హర్షిత్‌రెడ్డి, నాగమల్లిడి, హన్షిత నిర్మించారు. 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవల ఈ మూవీ ఆడియో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ న్యూ ఏజ్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అన్నారు. డైరెక్టర్ అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు వస్తున్న పాజిటివ్ వైబ్స్ చూసి సంతోషంగా ఉంది" అని అన్నారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని లవ్, హారర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ అందరికీ మంచి థ్రిల్ ఇస్తాయి" అని అన్నారు. నటి వైష్ణవిచైతన్య మాట్లాడుతూ "డిఫరెంట్ లవ్ స్టోరీ ఇది" అని చెప్పారు. చిత్ర నిర్మాత హన్షిత మాట్లాడుతూ "ఎప్పుడైనా, ఎవరైనా గోస్ట్‌ని లవ్ చేశారా? లవ్ చేయండి. మీకు తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు.

యూనిక్ కాన్సెప్ట్‌తో



'వైశాలి' చిత్రాన్ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌ల కాంబినేషన్‌లో వస్తున్న మరో చిత్రం 'శబ్దం'. ఈ సినిమా టీజర్‌ను విక్టరీ వెంకటేశ్ శుక్రవారం విడుదల చేశారు. హీరో ఆది ఒక హాంటెడ్ హౌస్ దగ్గర కొన్ని వింత సంఘటనలు జరిగినప్పుడు విచిత్రమైన శబ్దాలను రికార్డ్ చేయడం కనిపిస్తుంది. ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ టీజర్‌ను టెరిఫిక్‌గా ప్రజెంట్ చేశారు. 'వైశాలి'లో రెయిన్ బేస్డ్ సీన్లు చాలా ఉండగా, 'శబ్దం'లోని అధిక శాతం సీన్లను ముంబై, మున్నార్, చెన్నై వంటి పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించారు. అలాగే ఈ సినిమా కోసం 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్ వేయడం విశేషం. సిమ్రన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ తదితరులు నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సెవన్ జీ శివ చెప్పారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానంది.

చాలా రోజుల తర్వాత డాన్స్ చేశా
- వరలక్ష్మీ శరత్‌కుమార్



వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో మే 3న విడుదలవుతోంది. శుక్రవారం చిత్ర బృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలుగు ట్రైలర్‌ను హీరో వరుణ్‌సందేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'తెలుగులో తొలిసారి కథానాయిక ప్రాధాన్య చిత్రం చేశాను. మా నిర్మాత కథను నమ్మి రాజీపడకుండా సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాలో డాన్స్ చేశా' అన్నారు.

రాజ్ తరుణ్ క్రైమ్ కామెడీ

రాజ్ తరుణ్, రాశీ సింగ్ హీరోహీరోయిన్లుగా నటించే కొత్త చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేశ్ కుడుముల ని దర్శకుడిగా పరిచయం చేస్తూ మురళీధర్ రెడ్డి, కెటిఎన్ శ్రీనివాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు ప్రవీణ్ సత్తారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో దర్శకుడు మారుతి తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు నక్కిన త్రినాథరావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. అక్టోబర్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇది క్రైమ్ కామెడీ. 'స్వామి రారా', 'అంధధూన్' చిత్రాల తరహాలో ఉంటుంది' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 'కథ అద్భుతంగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'నా ఫేవరెట్ జానర్ క్రైమ్ కామెడీ. చాలా మంచి కథ. మీ అందరి ఆశీస్సులు కావాలి' అన్నారు రాజ్ తరుణ్. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపి: ఆదిత్య జవ్వాడి, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి.



కిడ్నాప్ డ్రామా



చైతన్యారావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన 'పారిజాత పర్వం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి , దేవేష్ నిర్మించిన హిలేరియస్ క్రైమ్ కామెడీ చిత్రమిది. ఈ సినిమా ట్రైలర్‌ను యాంకర్ సుమ లాంచ్ చేశారు. కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ ఆర్పుతారట. మళ్లీ లైట్స్ వేసే లోపు కేక్‌తో పాటు వాళ్ల ఆవిడ కూడా మన బండిలో ఉండాలి' అని కిడ్నాప్ ప్లాన్‌ను సునీల్ తన గ్యాంగ్‌కు వివరిస్తుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

'కిడ్నాప్ ఈజ్ యాన్ ఆర్ట్' అనే ట్యాగ్ లైన్‌ను జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్‌గా ఉన్నాయి. చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఈ మూడు పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ డ్రామా ఇది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్న ఈ ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది.

అటు కృష్ణమ్మ... ఇటు దుర్గమ్మ

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం ప్రతిభతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ మంచి నటుడిగా పేరు తెచ్చుకున్న సత్యదేవ్ తాజా చిత్రం 'కృష్ణమ్మ' రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ మూవీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు.



ఈ సినిమా నుంచి 'దుర్గమ్మ' అనే సెలబ్రేషన్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సాకేత్ కొమండూరి పాడారు. కాలాభైరవ స్వరాలు సమకూర్చారు. నవరాత్రుల సమయంలో దుర్గమ్మ ముందు హీరో సంతోషంగా ఆడి పాడే పాట ఇది. అతీరా రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘు కుంచె, నందగోపాల్ ఇతర ముఖ్యతారాగణం.

ఆస్పత్రిలో చేరిన సాయాజీ షిండే



పలు చిత్రాల్లో విలన్‌గా నటించిన సాయాజీ షిండేకు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిగా మహారాష్ట్రలోని సతారా ఆస్పతిలో చేర్పించారు. పలు వైద్య పరీక్షల అనంతరం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు బ్లాక్ అయ్యాయని వైద్యులు గ్రహించారు. వెంటనే ఆయనకు యాంజియోప్లాస్టీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే డిస్చార్జ్ చేస్తామన్నారు.

మహారాష్ట్రకు చెందిన సాయాజీ నటుడిగా తెలుగు వారికి సుపరిచితుడే. వచ్చీ రాని తెలుగులో ఆయన డైలాగులు పలికే విధానం ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించిన సాయాజీ దక్షిణాదిన కూడా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Bw03CGf
లో చదవండి.

16న శ్లాష్ పరీక్ష : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో అనురాధ

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 12: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 16న స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంటు సర్వే (శ్లాష్) నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎం.అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం జయనగర్ కాలనీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, ఏఎంఓ ధనలక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో ఎంఈవోలకు, సీఆర్పీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వుల మేరకు శ్లాష్ పరీక్షను సీఆర్పీ ద్వారా సమీప మండలాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈపరీక్షలకు సంబంధించి ఇప్పటికే ప్రశ్నాపత్రాలు ఓఎంఆర్ షీట్లు మండల కార్యాలయాలకు చేరాయన్నారు. కేటాయించిన పాఠశాలలో సీఆర్ఎంటీలు సర్వే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వీరికి సంబంధించి ఎంఈవోలు కేటాయించిన పాఠశాలల వివరాలను సీఆర్పీలకు సహకరించాలని ఆదేశించారు. అనంతరం సంబంధిత సెక్టోరియల్ అధికారులు ఎండీఎం, నాడు నేడు ఎలక్షన్ డ్యూటీ, డీసీఈ మార్కుల నమోదు, టోఫెల్ పరీక్ష, కెరియర్ గైడెన్స్‌పై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి వీక్లీబెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు



వీక్లీబెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్న సిబ్బంది

కడప (క్రైం), ఏప్రిల్ 12: పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒక సివిల్, ఏఆర్ విభాగం నుంచి ఒకరు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో నుంచి ఇద్దరిని ఎస్పీ ఎంపిక చేసి నగదు రివార్డులు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. తాళ్లప్రొద్దుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఎటువంటి బిల్లులు లేకుండా నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ దస్తగిరి, యాంటి రైట్ డ్రిల్‌ను సిబ్బందికి తర్ఫీదు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షేక్ ఖలందర్, ఇటీవల బద్వేలులో అక్రమంగా తరలిస్తున్న 177 ఫుల్‌బాటళ్ల డిఫెన్స్ మద్యాన్ని పట్టుకుని సీజ్ చేయడంలో కృషి చేసిన ఇంటెలిజెన్స్ వింగ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో హెడ్ కానిస్టేబుల్స్ ఓబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించారు.

అరుణాచల గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 12: తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలో వెలసిన అరుణాచల గిరి ప్రదక్షణకు జిల్లాలోని వివిధ డిపోల నుంచి ఈనెల 22, 23 తేదీలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరి వయా రాయచోటి, చిత్తూరు వేలూరు మీదుగా అరుణాచలం చేరుకుంటుంది. అలాగే బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి వయా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుంది. మరో బస్సు కూడా ఉదయం 7గంటలకే బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలం చేరుకుంటుంది. మైదుకూరు డిపోకు సంబంధించి ఉదయం 6 గంటలకు పోరుమామిళ్ల నుంచి బయలుదేరి వయా మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా చేరుకుంటుంది. ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు, కడప మీదుగా అరుణాలం చేరుకుంటుంది. జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 7గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా... పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు బస్సులు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటాయి.

డిపో	సర్వీస్ నెంబర్	సమయం	బస్సు రకం	టికెట్ ధర
కడప	6002	05.00	సూపర్‌లగ్జరీ	1,072
బద్వేల్	9569	07.00	అల్ట్రా డీలక్స్	1,566
బద్వేల్	60009	07.00	సూపర్‌లగ్జరీ	1,475
మైదుకూరు	97876	06.00	సూపర్‌లగ్జరీ	1,414
ప్రొద్దుటూరు	9944	21.00	సూపర్‌లగ్జరీ	1,273
పులివెందుల	59900	07.00	సూపర్‌లగ్జరీ	1,242
జమ్మలమడుగు	98398	19.00	సూపర్‌లగ్జరీ	1,352

నాన్ సీబీఎస్ఈ పాఠశాల్లో నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్ ప్రవేశపెట్టాలి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 12: విద్యార్థులను స్వయంపోషక జీవులుగా తయారు చేసే నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ విధానం కేవలం సీబీఎస్ఈ పాఠశాలల్లో ప్రారంభిస్తున్నారని.. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ సంయుక్త ప్రకటనలో కోరారు. నాన్ సీబీఎస్ఈ పాఠశాల్లో కూడా ఈ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో విద్యార్థులకు పలు రకాలైన వృత్తి విద్య నైపుణ్యాలు పెంపొందించే అవకాశం ఉంటుందన్నారు.

పకడ్బందీగా మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: ఈవీయంలు, వీవీ ప్యాట్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఈవీయంలు, వీవీ ప్యాట్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈవీయంలు, వీవీ ప్యాట్స్‌ల ర్యాండమైజేషన్ కోసం నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడం జరిగిందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అత్యంత పారదర్శకతతో ఈవీయంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్‌ను చేపట్టడం జరిగిందన్నారు. ఈవీయం, వీవీ ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా ఉంటుందని, సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీయం, వీవీ ప్యాట్స్ యంత్రాలను తరలించడం జరుగుతుందన్నారు. ఈవీయంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవోలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదు

వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొనరాదన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ సంబంధిత రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి పొందాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మోడల్‌కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ప్రత్యక్ష ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారించి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

రూ.20లక్షల నగదు పట్టివేత



స్వాధీన పరుచుకున్న నగదును చూపుతున్న సీఐ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 12 : రాజంపేట పట్టణంలో నిఎర్రబల్లిలో మెగదాష్ నరేష్ స్వగృహంలో రూ.20లక్షల నగదు పట్టుకున్నట్లు డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎర్రబల్లిలో ఓ ఇంటిలో నగదు ఉన్నట్లు సమాచారం అందడంతో పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తమ సిబ్బందితో నరేష్ స్వగృహంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి.. ఎటువంటి పత్రాలు లేని రూ.20 లక్షల నగదును స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఎలాంటి పత్రాలు లేని 50వేలు మించి నగదు ఉంటే దానికి సరైన ఆధారాలు చూపాలన్నారు. లేనిపక్షంలో నగదును సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో రూ..ఐదు లక్షలు...

కడప (క్రైం), ఏప్రిల్ 12: కడప నగరం అప్సరా సర్కిల్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి ఓ వ్యక్తి వద్ద ఉన్న రూ.5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రవికుమార్ తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం అప్సర సర్కిల్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా తనిఖీ చేసి అతని వద్ద ఉన్న రూ.5.90 లక్షలు నగదు సీజ్ చేశారు. ఐరన్ కొనుగోలు కోసం అప్సరావద్ద బ్యాంకులో నగదు డ్రా చేసుకుని వెళుతుండగా పోలీసులు ఆ నగదు పట్టుకున్నట్లు తెలుస్తుంది.

రాయచోటిలో రూ.2 లక్షలు...

రాయచోటిటౌన్, ఏప్రిల్ 12: రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్ఐ లోకేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఠానా సమీపంలో షిఫా హాస్పిటల్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తూ ఉండగా మన్సూర్‌అహ్మద్ అనే వ్యక్తి వద్ద ఎటువంటి రసీదులు లేని రూ.2 లక్షలు నగదును గుర్తించారు. సంబంధిత నగదును సీజ్ చేసి కేసు నమోదు చేయడమే కాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగదును ట్రెజరీలో డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రామచంద్ర, జగన్, రామ్‌నాయక్‌లు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల విద్యార్థుల విజయదుందుభి



విద్యార్థులను అభినందిస్తున్న డీన్ చంద్రకిశోర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో సుధీర్‌కుమార్‌రెడ్డి 466 మార్కులు, సి.షర్మిల 466, పి.అంజలి 466, పి.సృజన 465, ఎం.మాధురి, కె.వీరభువనేశ్వరిరెడ్డి 465, ఎం.శ్రీలేఖ, ఎన్.ధనుష్, ఎ.మోక్షిత, సి.నితిన్‌రెడ్డి, హరికిరణ్‌రెడ్డి, ఎస్.సుజిత, పి.మహ్మద్ హసన్, పి.సాకేత్‌రామ్‌రెడ్డి, ఎం.వెంకటనందిని, ఎల్.చరిత 464 మార్కులు సాధించారన్నారు. బైపీసీ విభాగంలో ఎం.పల్లవి, జోషిణి, మహ్మద్ అలీఖాన్ 435 మార్కులు, చరణ్‌చౌదరి, ఎస్.శార్వత్‌రాజ్ 433 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఇంత ఘన విజయం సాధించినందుకు కృషి చేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ చంద్రకిశోర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, ఏజీయం చెన్నక్రిష్ణరెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌టోసెలెవెల్-2 ఆల్ ఇండియా మొదటి స్థానంలో శ్రీచైతన్య

● శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఏజీఎం రమణయ్య, తదితరులు

సికెదిన్నె, ఏప్రిల్ 12: దేశవ్యాప్తంగా మూడవ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన ఇన్‌టోసెలెవెల్-2 పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు తిరుగులేని ఆధిపత్యాన్ని చాటాయని ఏజీఎం రమణయ్య తెలిపారు. కడపజోన్ నుంచి అత్యధికంగా ఆరుగురు విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌లు, 13 మంది విద్యార్థులు ట్యాబ్‌లు, 38 మంది స్మార్ట్‌వాచ్‌లు, 2,608 మంది విద్యార్థులు మెడల్స్ సాధించి విజయకేతనం ఎగురవేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ఆలిండియా టాపర్స్‌గా తీర్చిదిద్దడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎప్పుడు ముందుంటాయన్నారు. ఐఐటీ, నీట్, సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి శ్రీచైతన్య విద్యాసంస్థల్లో అమలుపరిచే కార్యక్రమాలు, డైరెక్టర్స్, ఫ్యాకల్టీనే కారణమన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సురేంద్రనాథరెడ్డి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపక సిబ్బంది నైపుణ్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చోరీ

సుండుపల్లె, ఏప్రిల్ 12: మండల కేంద్రానికి సమీపంలోని బాహుదా నది పీలేరు ప్రధాన రహదారి తిమ్మసముద్రంలో నిర్మించిన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీ పగులగొట్టి నగదు, స్వామివారి శూలం అపహరించినట్లు గ్రామస్తులు తెలిపారు. నగదుతో పాటు ఆలయంలోని అయ్యప్ప స్వామి శిలలు, పంచలోహాలతో చేసిన వాటిని అపహరించేందుకు గర్భగుడి తాళాలు పగులగొట్టినట్లు తెలిపారు. పూజారి జయరాం తాను భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేలోపు గర్భగుడి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కమలాపురం రూరల్, ఏప్రిల్ 12: మండల పరిధిలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రుషి కేశవరెడ్డి తెలిపారు. శుక్ర వారం ఆయన మాట్లాడుతూ కోగటం, సంబటూరు పంచాయతీ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించామన్నారు. యజమానులకు జరిమానా విధించినట్లు తెలిపారు.



హాస్టల్ గది పైకప్పు కూలిన దృశ్యం

కూలిన హాస్టల్ గది పైకప్పు

● విద్యార్థులకు తప్పిన ముప్పు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 12: స్థానిక జమ్మలమడుగురోడ్డులోని బీసీ బాలికల వసతి గృహంలో ఒక గది పైకప్పు కూలిపోయింది. అయితే అదృష్టవశాత్తు విద్యార్థులకు ప్రమాదం తప్పింది. ఈ హాస్టల్‌ను 2018లో ప్రారంభించారు. ప్రస్తుతం వసతి గృహంలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. పండుగ సెలవులకు విద్యార్థులు ఊరు వెళ్లగా నలుగురు విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారు. గురువారం రాత్రి ఆ విద్యార్థులు రోజు నిద్రించే గదిలో కాకుండా మరో గదిలో నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 10.45 గంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో వాచ్‌మెన్ వెళ్లి చూడగా దంతెలు విరిగి చౌడు మిద్దె గది కుప్పకూలింది. వాచ్‌మెన్ వార్డెన్ సత్యవతికి సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి పరిశీలించి.. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన రాత్రి ఒంటి గంటకు, శుక్రవారం ఉదయం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసయ్యలు కూలిన గదిని పరిశీలించారు. గది కూలే సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో వారికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. శుక్రవారం మధ్యాహ్నం డీఎస్పీ మురళీధర్ సంఘటన స్థలానికి చేరుకునివాచ్‌మెన్, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సంఘటనపై వసతి గృహ సంక్షేమ అధికారి సత్యవతి మాట్లాడుతూ హాస్టల్ భవనం శిథిలమవుతోందని, మరొక భవనంలోకి మార్చాలని అనేకమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చానని, భవనం మార్చాలనుకున్న సమయంలోనే ఈ సంఘటన జరిగిందన్నారు. కాగా, విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వలనే ఈ సంఘటన జరిగిందని విమర్శించారు. ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఏఎస్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు, పట్టణాధ్యక్షుడు పీటర్, మాజీ పట్టణాధ్యక్షుడు నాగరాజు, ఆలిండియా లాయర్స్ యూనియన్ విద్యార్థి విభాగం కోకన్వీనర్ హరితలు మాట్లాడుతూ భవనం మార్చమని వార్డెన్ కోరినా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, జిల్లా అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులను, వాచ్‌మెన్‌ను విచారిస్తున్న డీఎస్పీ మురళీధర్

‘రాచమల్లు ఓటమి చూసేవరకు నిద్రపోము’



మాట్లాడుతున్న శివచందారెడ్డి, కౌన్సిల్లర్లు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 12: ప్రొద్దుటూరులో రాచమల్లు ఓటమిని చూసే వరకు నిద్రపోమని.. రాచమల్లు అవినీతి అరాచకాలు, ఆధిపత్యం, వేధింపులపై తిరుగుబాటుగానే అసమ్మతి కూటమి కట్టామని.. ఆర్‌టీకే దోపిడీ దౌర్జన్యాలు రూపుమాపేందుకే టీడీపీలో చేరామని సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, మునీర్, మహ్మద్‌గౌస్, రామాంజనేయులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొర్రపాడురోడ్డులోని శివచంద్రారెడ్డి ఆయిల్ మిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లుకు అసమ్మతి కూటమి ఇచ్చిన షాక్‌తో దిక్కుతోచక మా సొంత గ్రామం కానపల్లెకు వందలాది మందని బయటి ప్రాంతాలనుంచి తీసుకువచ్చి బలం ప్రదర్శించాలని చూస్తుంటే జాలేస్తుందన్నారు. వైసీపీలో వుండే ఎంవీఆర్ కుటుంబంపై పోటీ చేసే నేను సర్పంచ్‌ను అయ్యానన్నారు. ఎమ్మెల్యేగా కానపల్లెకు కనీసం రూ.5 లక్షల పనులు కూడా మంజూరు చేయించలేకపోయావన్నారు. వివేకానంద కాలనీని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పి మోసం చేశావన్నారు. కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ మేము పార్టీ మారామని ఇష్టానుసారం మాట్లాడిస్తే ఊరుకుంటామనుకున్నావా అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్‌తో పాటు ఆవర్గం నాయకులు పాల్గొన్నారు.

24 మద్యం బాటళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 12: పోరుమామిళ్ల చెక్‌పోస్టువద్ద 24 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టి కలసపాడు మండలం మామిళ్లపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి వద్ద నుంచి 9 మద్యం బాటళ్లు, బాలగంగరాజు వద్ద నుంచి 15 మద్యం బాటళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వల్లూరులో...

వల్లూరు, ఏప్రిల్ 12: వల్లూరు గాంధీ సెంటరు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 19 మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నారనే విషయం తెలియడంతో సిబ్బంది దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇదేం పన్నుల దోపిడీ

● 15శాతం పన్ను పెంపుపై పెదవి విరుపు

● లబోదిబోమంటున్న పేద మధ్య తరగతి ప్రజలు

● సౌకర్యాలు లేవని ఆవేదన



పన్నులు చెల్లించేందుకు వచ్చిన ఇంటి యజమానులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న ‘విలువ ఆధారిత ఆస్తి పన్ను’ విధానంపై తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ప్రతి ఏటా 15 శాతం పన్ను బాదుడుపై సామాన్య మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ఇదేం పన్ను దోపిడీ అని ఎర్రగుంట్ల నగర పంచాయతీ వాసులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఎర్రగుంట్లను 2012లో నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పన్నుల మోత తారాస్థాయికి చేరింది. పన్నెండేళ్లలో దాదాపు 500 శాతానికి పైబడి పన్నులు పెరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం 15శాతం పెంచుకుంటూ పోతే కొన్ని సంవత్సరాల తర్వాత మా ఆస్తులు మీకే రాసివ్వాల్సి వస్తుందేమో అంటూ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌శాఖ పెంచిన ప్రతిసారి...

ఆస్తి విలువను రిజిస్ట్రేషన్‌శాఖ పెంచినప్పుడల్లా ఇంటి పన్నుల భారం కూడా పెరుగుతూనే ఉంటుంది. ఆశాఖకు ఇంటి పన్ను ముడి పెట్టడంతో ఇంటి యజమానులు బెంబేలెత్తుతున్నారు. రిజిస్ట్రేషన్‌శాఖ సంవత్సరానికో రెండేళ్లకో పెంచుతూనే ఉంటుంది. అద్దె విలువ ఆధారిత పన్నులు కాకుండా ఆస్తి విలువ ఆధారిత పన్నులు ఏపీ ప్రభుత్వం వసూళ్లు చేస్తుండటంతో ప్రతి ఏటా పన్నులు పెరుగుతూనే ఉంటాయి. ఇలా అయితే తాము బతికేదెలా అని పేద మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తమకున్న ఆస్తి విలువ పెరగకపోయినా పన్ను మాత్రం ఇష్టానుసారం పెంచేస్తున్నారని వాపోతున్నారు.

రూ.7లక్షలు పెరిగిన డిమాండ్

నగర పంచాయతీలో మొత్తం 10896 ఇళ్లు, ఇతర వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల భవనాలు ఉన్నాయి. వీటన్నిటికి పన్ను వసూళ్ల డిమాండ్ గత సంవత్సరం రూ.2కోట్ల 2లక్షలు ఉండగా ఈ సంవత్సరం రూ.2కోట్ల 9లక్షలుగా పెరిగింది. ఇది విజయవాడ నుంచి వచ్చిన డాటాగా ఇక్కడి అధికారులు చెబుతున్నారు. ఇక ఏప్రిల్ నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే 5 శాతం పన్నురాయితీ ఉంటుందని అధికారులు తెలిపారు. తరువాత సెప్టెంబరు వరకు ఎలాంటి అప రాధ రుసుం లేకుండా చెల్లించవచ్చునన్నారు.

పన్నుల పెంపు సరే... సౌకర్యాలేవీ..

గత 12ఏళ్లలో ఎర్రగుంట్లలో భారీగా ఇంటి పన్నులు పెరిగాయి. అయితే అందుకు తగ్గట్లుగా ఎక్కడా అభివృద్ధి జరగలేదు. తాగునీరు ఇప్పటికీ కొన్ని చోట్ల వారానికి.. మరికొన్ని చోట్ల పది రోజులకు వస్తున్నాయి. వర్షాలొస్తే నగర పంచాయతీ కంపుకొడుతుంది. వీధుల్లో, ప్రధాన కూడళ్లు, రహదారుల్లో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోతుంది. ఎక్కడ చూసినా మురుగు, చెత్తనే కనిస్తోంది. వీధుల్లో డ్రైనేజీ సౌకర్యం కల్పించిన పాపాన పోలేదు. కొన్ని చోట్ల మంజూరైన డ్రైన్లను కూడా పనికట్టుకుని వేయకపోవడం గమనార్హం. ప్రకాష్‌నగర్, రాణీ వనం, మెయిన్‌బజార్, ముఖ్యంగా జాతీయ రహదారిలోనే డ్రైనేజీ ఔట్‌లెట్‌లేక నీరంతా రోడ్లపైనే ఆగుతోంది. ప్రకటనల్లోనే అభివృద్ధి తప్ప, కంటికి ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కానీ పన్నులు మాత్రం ప్రతిఏటా పెంచుతూనే పోతున్నారని ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

నల్లారికి ఘన స్వాగతం...

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 12: ప్రచారంలో భాగంగా రాజంపేట బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం రాత్రి రైల్వేకోడూరుకు చేరుకున్నారు. చిట్వేలి రోడ్డులో ఉన్న విజయ కన్వెన్షన్ హాలులో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలను కలుసుకుని పరిచయం చేసుకున్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథ్ నాయుడు, జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయి లోకేష్, పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, రాష్ట్ర యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి, జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ బీజేపీ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనతల సురేష్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయను ఘనంగా సన్మానించారు.

పార్లమెంట్ అధ్యక్షుడిని కలిసిన టీడీపీ శ్రేణులు



జగన్‌మోహన్‌రాజును కలిసిన టీడీపీ నాయకులు

సుండుపల్లె, ఏప్రిల్ 12: తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును శుక్రవారం కలిసినట్లు ండల తెలుగు యువత అధ్యక్షులు మాలేపాటి సురేశ్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబునాయుడు, చంద్రశేఖర్‌రాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చంద్రమౌళి తెలిపారు. ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంలను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరినట్లు వివరించారు.

టోఫెల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీసీఈబీ టీమ్

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 12: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగి టోపెల్ పరిక్షా కేంద్రాలను డీసీఈబీ టీమ్ సెక్రెటరీ నాగమునిరెడ్డి, ఏఎంఓ రామకృష్ణ, కిరణ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులు మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు ఆంగ్లబోధనలో మరింత పట్టు పెంచాలని వారు సూచించారు. ఈ టోపెల్ పరీక్ష ప్రతి పాఠశాలలో నిర్వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయురాలు శ్రీకళ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

సిద్దవటం, ఏప్రిల్ 12: సిద్దవటం మండలం టక్కోలు ఎస్సీ కాలనీలో శుక్రవారం, సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థ ప్రసాదాలు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. కొంత మంది భక్తులు నెత్తిన కలశమును పెట్టుకొని భక్తిశ్రద్ధలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

రాజంపేట సర్వతోముఖాభివృద్ధికి కృషి

● కార్యకర్తల సమావేశంలో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



ఐక్యతారాగాన్ని ఆలపిస్తున్న టీడీపీ బీజేపీ, జనసేన నాయకులు

రాజంపేట, ఏప్రిల్ 12 : బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తుందని రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాజంపేటలో శుక్రవారం ఉదయం రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజంపేటను వైసీపీ నాయకులు అధోగతిపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతికి, దౌర్జన్యాలతో రాజంపేట ప్రాంతం సమస్యల్లో కూరుకుపోయిందన్నారు. మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ పార్ల మెంటు అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, టీడీపీ జిల్లామాజీ ఉపాధ్యక్షుడు మాలేపాటి రామకృష్ణం నాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి నాగమునిరెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు. కూచివారిపల్లె పంచాయతీ భరత్ నగర్‌లో సీనియర్ టీడీపీ నాయకులు కావుటూరి సుబ్రమణ్యంనాయుడు (మణి), కావుటూరి ఆదినారాయణ సోదరులు ప్రచారానికి వచ్చిన రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ మహిళ జిల్లా మాజీ అధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి ఇంటికి నల్లారి, సుగవాసి వెళ్లి ఆమె మద్దతు కోరారు.

రాయచోటిటౌన్: టీడీపీ, జసేన, బీజేపీ కూటమి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని రాయచోటి మైనార్టీ నేత ముస్తాక్ హుస్సేన్ కలిశారు. శుక్రవారం రాజంపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశానికి హాజరై మద్దతు ప్రకటించారు.

నందలూరు: జనసేన పార్టీ నాయకులు యల్లటూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కుమ్మరపల్లెలో ఏర్పాటు చేసిన విందులో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలనను ప్రజలు బాగా గుర్తించారని అన్నారు. తమ ఓటుతో గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎదు ్ల సుబ్బరాయుడు, పోలి సుబ్బారెడ్డి, నాగోతు రమేష్‌నాయుడు, ఎద్దల విజయసాగర్, శివరామరాజు, సమ్మెట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు విముక్తి

● టీడీపీ అభ్యర్థి మండిపల్లి ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఏప్రిల్ 12: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమవుతుందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పాతరాయచోటి 32, 33వ వార్డుల్లో జయహో బీసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీల రిజర్వేషన్ శాతాన్ని తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలకు వైసీపీ అడ్డం పడిందని గుర్తు చేశారు. నాలుగు పర్యాయాలు గెలిచిన శ్రీకాంత్‌రెడ్డి పాతరాయచోటిలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ఈ సమావేశానికి ముందు పాతరాయచోటిలో ఇంటింటికి తిరిగి ప్రచారంచేశారు. ఈ సమావేశంలో పాతరాయచోటికి చెందిన బీసీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి, సుగవాసి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణం లోని ఎస్ఎన్‌కాలనీలోని టీడీపీ కార్యాలయంలో రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్స్ కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి వారి సంపూర్ణ మద్దతును ప్రక టించారు. అనంతరం ఆర్మీ కుటుంబాలకు చెందిన పలువురు మహిళలను, మాజీ ఆర్మీ ఆఫీసర్స్‌ను రాంప్రసాద్‌రెడ్డి శాలువాలతో సత్క రించారు. రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్స్ గురిగింజ బాలాజీ, గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, నరసింహారెడ్డి, వేమారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలోని గోపనపల్లెలో మాజీ డీలర్ వెంకట్రమణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. స్థానిక టీడీపీ నాయకులు కోటిరెడ్డి, చలపతినాయుడు, ఇరుగుల్‌రెడ్డి, ఖాజాపీర్, వెంకటమల్లప్పనాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



సీతారామాలయం

సుండుపల్లె, ఏప్రిల్ 12: మండల పరిధిలోని ఎర్రమనేనిపాలెం గ్రామ పంచాయతీ దిన్నెమీద బలిజపల్లెలో నిర్మించిన సీతారామాలయంలో విగ్రహప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15న సోమవారం గో పూజ, గణపతిపూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన విగ్రహాలకు యంత్రములకు అభిషేకాలు, మంగళహారతి, సాయంత్రం అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, దీక్ష హోమం, గణపతి హోమం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. 16న ఉదయం ప్రాతఃకాల పూజ, రుద్రాభిషేకం, దీక్షా హోమం, విష్ణు సహస్రనామ హోమాలు, సాయంత్రం విగ్రహాల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 17వ తేదీ బుధవారం ఉదయం ప్రాతఃకాల పూజ అనంతరం యంత్ర ప్రతిష్ఠ, పదిన్నర గంటల నుంచి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర, కలశ ప్రాణప్రతిష్ఠ హోమం, శాంతి హోమం, జ్వాలా దర్శనం, గోదర్శనం, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం ఉంటుందన్నారు.

గుండెపోటుతో టీడీపీ అభిమాని మృతి

గాలివీడు, ఏప్రిల్ 12: టోరాన్‌చెరువుకు చెందిన రెడ్డెప్ప (50) శుక్రవారం అరవీడులో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం అస్వస్థతకు గురికావడంతో స్థానికులు వైద్యశాలకు తరలిస్తుండగా మరణించినట్లు స్థానికులు తెలిపారు. లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి ఘననివాళులు అర్పించారు.

'ఎన్‌డీఏ అభ్యర్థి గెలుపు తథ్యం'

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 11 : మండలంలోని గద్దలరేవుపల్లి గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, శేషక్కగారిపల్లె, బి.పి.రాచపల్లె గ్రామాల్లో రైల్వేకోడూరు కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ప్రచారం నిర్వహించారు. ముక్కా సాయి వికాస్‌రెడ్డి సతీమణి శిరీష, అనితాదీప్తి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఇన్‌చార్జి విశ్వనాథనాయుడు, పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి, బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు, అలాగే మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, నాయుడోరి రమణ, మాజీ సర్పంచ్‌లు గద్దల రేవుపల్లి శ్రీధర్‌రాజు, కోడూరు జనార్ధన్‌నాయుడు, చప్పిడి రమేష్‌బాబు, అనుమలగుండం చంద్రమోహన్, కల్లా చలపతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీంద్రనాయుడు, ఉమ్మలరాజు పిచ్చిరాజు, సుబ్బరాజు, గునిపాటి కిరణ్, బీజేపీ నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పోలిన శివయ్య నాయుడు, నాగేంద్ర నాయుడు, కోటేశ్వరరావు, ఉమ్మడి పార్టీల వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి: - డీఎంహెచ్‌వో

సుండుపల్లె, ఏప్రిల్ 12: ప్రభుత్వ వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌వో కొండయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లె సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియపరచాలన్నారు. మధ్యాహ్నం సమయంలో మజ్జిగ, ఓఆర్ఎస్‌తో పాటు శీతల పానీయాలు సేవించాలని సూచించారు. ప్రతి సచివాలయంలో వైద్యశాలల్లో వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి ఫర్హానా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై తక్షణ చర్యలు చేపట్టాలి

సంబేపల్లె, ఏప్రిల్ 12: వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని మండల అధ్యక్షురాలు ఆవుల నాగశ్రీలక్ష్మి అధికారులకు తెలియజేశారు. శుక్రవారం ఎంపీడీవో నిర్మలాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళి పాటిస్తూ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హరినాథరెడ్డి మాట్లాడు తూ.. తాగునీటి సమస్యలు ఎన్నికల నిబంధన కిందికి రావని సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. పై స్థాయి అధికారుల అనుమతులు తీసుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని అరికడతామన్నారు. పైపులైన్ రిపేర్లు, కొత్తమోటార్ల ఏర్పాటు వంటి పనులు చేస్తామన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు, ఒక రోజుకు ఓ వ్యక్తికి 15 లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు అనుమతులు ఉన్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలనను తరిమేద్దాం

చిట్వేలి, ఏప్రిల్ 12 : రాష్ట్రంలో అరాచక పాలనను తరిమేద్దామని టీడీపీ సీనియర్ నాయకులు విశ్వనాథం నాయుడుతెలిపారు. శుక్రవారం మండలంలోని సి.కందులవారి పల్లె రెడ్డివారిపల్లెలో గూడూరు జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ ముక్కా వరలక్ష్మీతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్లాస్ కమలం గుర్తులకు ఓటేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త విశ్వేశ్వర్ నాయుడు, బాలు రామాంజులనాయుడు, మాజీ మండల అధ్యక్షుడు లారీ సుబ్బరాయుడు, అడ్వకేటు బాలాజీ, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసి ంహ, యువ నాయకుడు కాకర్ల నాగార్జున, పి.రమేష్, బాలు రెడ్డయ్య, పట్టా లోకేష్, ఏదోటి రాజశేఖర్, అనంతయ్య యాదవ్, గుండాలయ్య యాదవ్, మైనారిటీ నాయకులు కరీంబాష, షబ్బీర్, కొత్తూరు ఈశ్వరయ్య, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రీజెన్సీ నలందా, గీతాంజలి, రాజు విద్యార్థుల విజయ కేతనం

రాజంపేట రీజెన్సీ నలందా విద్యార్థులు | గీతాంజలి కళాశాల విద్యార్థులు



సి.తేజశ్విని (బైపీసీ 434) | ఎన్.సంధ్య (సీఈసీ 487) | సుహనా ఫిర్దోజ్ (ఎంపీసీ 464) | పోలి రుద్రారెడ్డి (ఎంపీసీ 978) | శిరీష (ఎంపీసీ 975) | డి.వైష్ణవి (ఎంపీసీ 457) | ఇ.ప్రియహసిని (ఎంపీసీ 445) | .వెంకట అఖిల్ (ఎంపీసీ 443) | వి.రాశి (బైపీసీ 938) | జి.వి.నీలిమ (బైపీసీ 933)



మహాలక్ష్మీ (ఎంపీసీ 973)

ఉత్తమ ఫలితాలు సాధించిన రాయచోటి రాజు విద్యార్థులు

రాజంపేట, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షల్లో రాజంపేట రీజెన్సీ నలందా విద్యార్థు లు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.నరసయ్య తెలియజేశారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో షేక్ సుహన ఫిర్దోజ్ 464/470 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు.బైపీసీలో సి.తేజశ్విని 434/440 మార్కులు, సీఈసీ విభాగంలో ఎన్.సంధ్య 487/50, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రుద్రారెడ్డి 978/1000, ఎంపీసీలో మేరువ మహాలక్ష్మి 973/1000, బైపీసీలో తానియా 966/1000 మార్కులు సాధించి విజయదుందుభి మోగించారన్నారు. ఆయా విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు అభినందించారు. ఇలాంటి ఫలితాలు రావడానికి కృసి చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్స్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఈవో గుడారు విజయ్ చందు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతాంజలి విద్యా సంస్థల్లో

గీతాంజలి విద్యాసంస్థల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల కరస్పాండెంటు ఎస్.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో డి.వైష్ణవి 457/470, ఇ.ప్రియహాసిని 445/470, సి.వెంకట అఖిల్ 443/470, ఎం.భాస్కర్ 426/470, సీఈసీలో ఏ.ధర్మతేజ 415/500 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో వి.రాశి 938/1000, జి.వి.నీలిమ 933/1000, కె.అభిషేక్ 908/1000, ఎంపీసీలో ఎ.చక్రపాణి 902/1000 మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభ కనబరిచారన్నారు.

'రాజు' విద్యార్థుల అత్యధిక మార్కులు

రాయచోటిటౌన్: 2024 ఇంటర్ పరీక్షల్లో రాజు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్. బాబావలి 986 , పీ. తులసి 980 మార్కులు సాధించగా, బైపీసీలో కే. యోగదీపిక 980, పీ. మానస 980 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విభాగంలో కే. సాయిరక్షిత 464, జీ. విజయదుర్గ 464, పీ. పద్మిని 462, ఎస్. అఫ్సా ఫాతిమా 462, ఎం.వర్షిని 460 మార్కులు సాధించగా బైపీసీ విభాగంలో ఎన్. ఉషస్సుహాసిని 433, ఎస్. హనీఫాఅంజుమ్ 433 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారికి సహకరించిన తల్లిదండ్రులను, అధ్యాపకులను రాజు విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సుబ్బరాజు అభినందించారు. సీఈవో శంకర్‌నారాయణ, ప్రిన్సిపాల్ ధర్మరాజు, భాస్కర్‌రాజు, పద్మజ పాల్గొన్నారు.

మోడల్ కళాశాలల్లో

రామాపురం, ఏప్రిల్ 12: రాష్ట్రంలో శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని ఏపీ మోడల్ కళాశాల విద్యార్థి కార్తీక్‌సాయి ఎంపీసీలో 974 మార్కులు సాధించగా, బైపీసీలో ఎస్ కదిరున్ 939 మార్కులు సాధించారు. రామాపురంలో ఫస్ట్ ఇయర్‌లో 214 మంది పరీక్షలు రాయగా, 83 మంది పాసయ్యారు. సెకండ్ ఇయర్‌లో 167 మందికిగాను 68 మంది పాసయ్యారు. ఏపీ మోడల్ కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 68 మంది పరీక్షలు రాయగా 41 మంది, సెకండ్ ఇయర్‌లో 61 మందికి గానూ 40 మంది పాసయ్యారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో మొదటి సంవత్సరంలో 31 మందికి గాను 25 మంది, రెండో సంవత్సరంలో 21 మందికి గానూ 19 మంది పాసయ్యారు. ఏపీ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం 32 మందికి 17 మంది పాసయ్యారు. సెకండ్ ఇంటర్‌లో 17 మందికిగాను 9 మంది పాసయ్యారు.

సంబేపల్లె: సంబేపల్లె మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరంలో 17 మంది విద్యార్థులకు గానూ 15 మందిపాసై 88 శాతం , ద్వితీయ సంవత్సరంలో 8 మంది విద్యార్థులకు 8 మంది ఉతీర్ణత సాధించి వందశాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాలక్ష దిలీప్ కుమార్ తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఆయిష 417/470, బైపీసీలో హరిప్రియ 352/400 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో సమీరా 866/1000 మార్కులు సాధించినట్లు వివరించారు. ఫలితాల్లో సంబేపల్లె మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటడం పట్ల విద్యార్థులకు ఆ పాఠశాల అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలోని ఏపి మోడల్ కాలేజి విద్యార్థులు ఉత్తమ పలితాలు సాదించారని ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో కీర్తి 338, ఎంపీసీలో వంశీ 352 నాగేశ్వరి 421 మార్కులు సాధించారు. ఇంటర్ రెండవ సంవత్సరం బైపీసీలో మహాలక్ష్మి 833 శ్రీదేవి 822, సీఈసీలో కే చందు 826 ఎంపీసీలో ధనుష్ 732,, ఎంఈసీలో సుస్మిత702 మార్కులు సాదించారు .మొదటి సంవత్సరం 46 శాతం, ద్వితీయ సంవత్సరం 68శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. అంబేద్కర్ బాలికల గురుకుల కాలేజిలో ద్వితీయ సంవత్సరంలో టి భార్గవి (ఎంపిసి)908-1000 శైలజ (బైపిసి) 912-1000 మొదటి సంవత్సరంలో శిరీష (ఎంపిసి) 430-470, బైపీసీలో అర్షిత 381-440, కళ్యాణి 381-440 మార్కులు సాదించారని ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. శ్రీవెంకటేశ్వర ఎయిడెడ్ జూనియర్ కాలేజి 85 శాతం, కస్తూరిభాగాంధీ గురకుల కాలేజిలో మంచి పలితాలు సాదించారని ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు

చిన్నమండెం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. సెకండ్ ఇంటర్ ఎంపీసీలో కే. నాగేంద్రబాబు 970 మార్కులు, దివ్య 960 మార్కులు, బైపీసీలో 946 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఇంటర్‌లో ఎంపీసీలో గీతాంజలి 470 మార్కులకు గానూ 452 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ 130 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 99 మంది, సెకండ్ ఇంటర్‌లో 104 మంది పరీక్షరాయగా 94 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఓబులవారిపల్లె: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చిన్నఓరంపాడులో ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరిత తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపులో 911 మార్కులు సాధించిన ఎస్.జాస్మిన్ కళాశాల టాపర్‌గా నిలిచారు. ఎంపీసీలో 802 మార్కులు ఎ.ధనుష్ సాధించగా సీఈసీలో 702మార్కులు ఎన్.లక్ష్మి, హెచ్ఈసీ 511 మార్కులు మన్సూర్ సాధించినట్లు, మొత్తంగా 62 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే మొదటి సంవత్సరం పరీక్షలలో కూడా మంచి పలితాలు వచ్చాయని తెలిపారు.

నందలూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ద్వితీ య సంవత్సరంలో 30 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 21 మంది పాసయ్యారు. సెకండ్ ఇయర్ హెచ్ఈసీ విద్యార్థి పవన్ 879 మార్కులతో కళాశాల ప్రథమ స్థానంలో నిలువగా, సెకండ్ సీఈసీ నుంచి శివ కీర్తి 836, ఎంపీసీ నుంచి సాయి సుప్రజ 760 మార్కులు సాధించారని తెలిపారు ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో సాయి కీర్తన్ 424 మార్కులు, సీఈసీలో వై.సునీత 393 , బైపీసీలో అగ్న చక్రాంత 369 సాధించారని తెలిపారు.

పుల్లంపేట: పుల్లంపేటలోని ఆదర్శ పాఠశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 60 శాతం, మొదటి సంవత్సరం 38 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తెలిపారు.



కార్తీక్‌సాయి (ఎంపీసీ 974) | సమీరా (866) | ఆయేషా (ఎంపీసీ 417) | హరిప్రియ (బైపీసీ 352) | నాగేంద్రబాబు (970) | గీతాంజలి (452) | జాస్మిన్ (బైపీసీ911) | పవన్ (హెచ్ఈసీ 879) | సాయికీర్తన్ (ఎంపీసీ 424)

మారిన పూతలపట్టు రాజకీయం

● ఎంఎస్ బాబు కాంగ్రెస్ అభ్యర్థి కావడంతో భారీగా చీలనున్న వైసీపీ ఓట్లు

● టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ విజయానికి మార్గం సుగమం

చిత్తూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దెబ్బ వైసీపీకి గట్టిగానే తగిలేలా ఉంది. వైసీపీ టికెట్ దక్కక బయటికొచ్చేసిన ఆయన కాంగ్రెస్ తరఫున పూతలపట్టు నుంచి పోటీ చేయనున్నారు. ఈ ప్రభావం తీవ్రంగానే ఉండే అవకాశం ఉంది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో పూతలపట్టు ఏర్పడింది. అప్పటి నుంచి ఇక్కడ టీడీపీ ఒక్కసారి కూడా గెలవలేదు. 2009లో కాంగ్రెస్ తరఫున రవి, 2014లో వైసీపీ నుంచి సునీల్‌కుమార్, 2019లో వైసీపీ నుంచి ఎంఎస్ బాబు పోటీ చేసి గెలుపొందారు. ఈ మూడు ఎన్నికల్లోనూ పలమనేరు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి పోటీ చేశారు. ఇక, తాజాగా ఎన్నికల్లో టీడీపీ తరఫున జర్నలిస్టు మురళీమోహన్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ బరిలో ఉన్నారు. తనకు టికెట్ లేదని చెప్పిన వెంటనే మీడియా ముందు ఆగ్రహం ప్రకటించిన ఎంఎస్ బాబు, ఆతర్వాత సర్దుకుని మౌనం వహించినట్లు కనిపించినా లోలోపల ఆయన కార్యకలాపాలు కొనసాగాయి. 2019లో టికెట్ నిరాకరించాక సునీల్ కుమార్ క్రియాశీలంగా లేరు. నియోజకవర్గంలో కనిపించేవారు కాదు. ఇప్పుడు టికెట్ మళ్లీ దక్కడంతో కిందామీదా పడుతున్నారు. సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు ఉన్నంత సంబంధాలు ఆయనకు లేవు. ఎంఎస్ బాబు పూతలపట్టు నియోజకవర్గంలో తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వైసీపీపై కోపాగ్రహాలతో ఉన్న ఆయన ఖర్చుకు కూడా వెనుకాడేట్టుగా లేరు. వైసీపీకి మళ్లిన కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లను ఆయన చీల్చుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా ఎస్సీ ఓట్లు ఆయన చీల్చుకుంటారని అంచనా. ఇందువల్ల టీడీపీ గెలుపు అవకాశాలు మరింత మెరుగు అవుతాయని అంటున్నారు.

టీడీపీకి నల్లేరు మీద నడకేనా?

పూతలపట్టు నియోజకవర్గం ఏర్పడినాక ఒక్క 2019 ఎన్నికలు మినహా మిగిలిన రెండు ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి అతి తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రవికి 64,484 ఓట్లు, టీడీపీ లలితకుమారికి 63,533 ఓట్లు పడ్డాయి. అంటే, రవి 951 ఓట్ల మెజార్టీతో మాత్రమే గెలుపొందారు. అలాగే 2014 ఎన్నికల్లో వైసీపీ సునీల్‌కుమార్‌కు 83,200 ఓట్లు, టీడీపీ లలితకుమారికి 82,298 ఓట్లు పడ్డాయి. 902 ఓట్ల తేడాతో సునీల్‌కుమార్ గెలిచారు. ఫ్యాను హవా నడిచిన 2019 ఎన్నికల్లో మాత్రం 30 వేల ఓట్ల తేడా ఉంది. దీన్నిబట్టి పరిశీలిస్తే ప్రభుత్వ వ్యతిరేకతకు ఎంఎస్ బాబు ప్రభావం తోడవుతుందని, టీడీపీ గెలుపు నల్లేరు మీద నడకగా మారుతుందని అంచనా వేస్తున్నారు. రాజకీయాలకు కొత్తవాడైన మురళిని టీడీపీ అభ్యర్థిగా ఎంపిక చేసినందున గెలుపు తమదే అని ఇప్పటిదాకా చెప్పుకుంటున్న వైసీపీ వర్గాల గొంతులో ఎంఎస్‌బాబు రూపంలో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యింది.

వైసీపీ నమ్మకద్రోహం చేసింది

● విలువల్లేని పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరా ● పూతలపట్టు ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తా ● ఎంఎస్ బాబు వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 12: 'వైసీపీ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కష్టపడ్డా. అలాంటి నాకు ఆ పార్టీ నమ్మద్రోహం చేసింది. వైసీపీ కోసం ఎంతో కష్టపడి పాదయాత్ర చేసిన షర్మిలమ్మకే నమ్మక ద్రోహం చేసిన విషయం తెలిసిందే. సొంత చెల్లెలికే అటువంటి పరిస్థితి అంటే నా గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు' అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వ్యాఖ్యానించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూతలపట్టులో జరిగిన సిద్ధం సభకు స్థానిక ఎమ్మెల్యే అయిన తనను ఆహ్వానించకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ తనను వాడుకొని వదిలేసిందని వాపోయారు. నియోజకవర్గంలోని ప్రతి గడప తొక్కానని, ప్రతి ఇంటి కష్టం తనకు తెలుసన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు అందుబాటులో, అండగా ఉన్నానని గుర్తుచేశారు. చిత్తూరు వాడినైన తనను పూతలపట్టు ప్రజలు సొంత మనిషిగా ఆదరించారని, వారి కష్టం తీర్చేందుకే కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. వీళ్లందరి ఆదరణతో పూతలపట్టు ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తంచేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌లో తన రాజకీయ ప్రస్థానం మొదలైందని, తిరిగి ఆ పార్టీ గూటికే చేరడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ అండతో, ఏపీలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందన్నారు. షర్మిలమ్మను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. ఈ నెల 15న బంగారుపాళ్యం మండలంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బస్సుయాత్రను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విక్టోరియా, రాణి యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

చిత్తూరు, ఏప్రిల్ 12: జిల్లాలో తాగునీటికి ఎలాంటి సమస్య రాకుండా చూడాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్నారు. నిబంధనల మేరకు గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని చెప్పారు. మండల స్థాయిల్లో ఎంపీడీవోలు అప్రమత్తంగా ఉంటూ, నివేదికలు ఇవ్వాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని, వడదెబ్బకు ఎవరూ గురికాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం



చిత్తూరు గాంధీ విగ్రహం సర్కిల్‌లో పలుచగా కనిపిస్తున్న జనం

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 12: జిల్లాలో నాలుగు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన జనం శుక్రవారం కాస్త ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ఉపశమనం పొందారు. సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావడంతో చల్లటి గాలులు వీచాయి. మండలాల వారీగా.. ఉష్ణోగ్రత వివరాలిలా ఉన్నాయి. నింద్రలో 39.3, తవణంపల్లెలో 38.5, గుడుపల్లె, సోమల, పుంగనూరులో 37.8, గుడిపాలలో 37.7, చిత్తూరులో 37.6, బంగారుపాళ్యం, శ్రీరంగరాజపురంలో 37.5, నగరి, విజయపురంలో 37.4, కుప్పంలో 37.2, సదుం, కార్వేటినగరంలో 36.9, వెదురుకుప్పంలో 36.8, చౌడేపల్లె, పాలసముద్రం, పులిచెర్ల, రొంపిచెర్లలో 36.4, గంగాధరనెల్లూరులో 36.3, పలమనేరు, పెనుమూరు, యాదమరిలో 35.9, పెద్దపంజాణిలో 35.5, పూతలపట్టు, శాంతిపురంలో 35.4, వి.కోటలో 34.9, గంగవరంలో 34.3, బైరెడ్డిపల్లెలో 34.2, ఐరాలలో 33.8, రామకుప్పంలో 33.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అక్రమ సంపాదనతో విజయానందరెడ్డి అరాచకాలు

● ఈద్గాను ప్రచార వేదికగా మార్చుకోవడంపై విచారించాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 12: హరామ్ (అక్రమ) సంపాదనతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ మేయర్ కటారి హేమలత ఆరోపించారు. శుక్రవారం నగరంలోని గురజాల జగన్మోహన్ నివాసంలో వారు మీడియాతో మాట్లాడారు. రంజాన్ పర్వదినాన విజయానంద రెడ్డి ఈద్గాలో రాజకీయ ప్రసంగం చేయడం సిగ్గుచేటన్నారు. పైగా 'ముస్లింలు బిర్యానీ తింటారు.. గడ్డి తినరు' అని ఆయన చేసిన వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. ప్రార్థన జరుగుతున్న సమయంలోనే వేదికపైకి వెళ్లడం, రాజకీయ ప్రసంగం చేయడం, కొందరు ముస్లిం సోదరులను బెదిరించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ఈద్గాను ప్రచార వేదికగా మార్చుకోవడంపై కలెక్టర్ నిష్పక్షపాతమైన విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. ముస్లిం మైనార్టీ నేతలు అబుల్ హసేన్, అత్తుబాయ్, నౌషాద్, జనసేన నేత ఆరిఫ్ మాట్లాడుతూ.. ఈద్గా దర్గా ఖాజీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని, ఆయన్ను తక్షణం పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనార్టీ నేతలు జాఫర్, షరీఫ్, జిలాని, అన్వర్, మహబూబ్ బాషా, మున్నా, షేరు, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యపానంతో సీఎం జగన్ రూ.లక్ష కోట్ల లూటీ

మద్యపానంతో సీఎం జగన్ లక్షకోట్లు లూటీ చేశారని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. కల్తీ మద్యంతో వేలాది మంది మహిళల మంగళసూత్రాలు తెంచిన వ్యక్తి జగన్ రెడ్డి అన్నారు. జే బ్రాండ్ల మద్యంతో దోచుకున్న లక్షల కోట్ల డబ్బును వైసీపీ నేతలు కంటైనర్ల ద్వారా ఎన్నికలకు తరలించారని ఆరోపించారు. మద్యనిషేధంపై మాటతప్పి మడమతిప్పిన జగన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అవస్థలు



కార్వేటినగరం, ఏప్రిల్ 12: ప్రతి చోటా జగన్ బొమ్మ ఉండటంతో ఎన్నికల కోడ్ దృష్ట్యా దాన్ని కనపడకుండా చేయడానికి అందరికీ అవస్థలు తప్పడం లేదు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పాల ప్యాకెట్లపైనా జగన్ బొమ్మ ఉండటంతో దానిపై కాగితం అంటించి సరఫరా చేస్తున్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 12: జిల్లాలో ఈనెల 4న మొదలైన జేఈఈ మెయిన్స్ సెషన్-2 పరీక్షలు శుక్రవారం ఉదయంతో ముగిశాయి. వేమూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో జరిగిన పరీక్షలో 20 మందికిగాను 12మంది హాజరవగా, 8 మంది గైర్హాజరైనట్లు సిటీ కోర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

భూ సర్వేలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి: జేసీ

చిత్తూరు, ఏప్రిల్ 12: భూ సర్వేలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖల అధికారులతో కలిసి జాతీయ సర్వే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తయ్యాక మిగిలిన సర్వే పనులను కూడా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకుడు గౌస్‌బాషా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సర్వేయర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

● 12వేల మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

● ఎన్నికల విధులకు గైర్హాజరైతే సస్పెన్షన్ తప్పదు

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు, ఏప్రిల్ 12: జిల్లాలో వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకెళ్లి ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న 12వేల మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, పూతలపట్టు ఆర్వో చిన్నయ్య, చిత్తూరు ఏఆర్వో అరుణతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

● ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదు. ముందస్తుగా సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు సమాచారం ఇస్తే పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తాం. అయితే మేడే రోజున నిర్వహించే ఏ కార్యక్రమాలకైనా అనుమతి తీసుకోవాలి. వాహనాల్లో తెర ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న అభ్యర్థులు అనుమతి తీసుకోవాలి.

● దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వారు ఇంటి నుంచి ఓటు వేసే అంశంపై ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు అభిప్రాయ సేకరణ చేపట్టను న్నాం. పూర్తిగా బెడ్‌పై ఉన్నవారు, నడవలేని వారు ఇంటి నుంచే ఓటు వేయడానికి చర్యలు తీసుకుంటాం.

● సీ-విజిల్ యాప్ ద్వారా 368 ఫిర్యాదులు అందాయి. 5,650 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలో ఈనెల 11వ తేదీ వరకు చేపట్టిన తనిఖీల్లో రూ.2,29,66,410, రూ.4,47,35,387 విలువ చేసే బంగారం, వెండిని, రూ.46,98,845విలువైన బియ్యం, గోడ గడియారం, కుక్కర్లు, డ్రెస్ మెటీరియల్స్ సీజ్ చేశాం.

● ఎంసీసీ అమలులో ఉన్నందున గంగమ్మ జాతర ఉత్సవాలపై నిర్వాహకులు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. పోలింగ్ తర్వాత రోజున జాతర జరుగుతున్నట్లు తెలిసింది. దీనికి పక్క రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. ఎన్నికల నిబంధనల మేరకు సరిహద్దుల్లో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తారు. ఓవైపు పోలింగ్, మరోవైపు బందోబస్తు పనులు కష్టమవుతుంది. జాతర నిర్వాహకులు తేదీని మార్పు చేసుకునే విషయంపై ఆలోచించుకోవాలని సూచిస్తున్నాం.

పకడ్బందీగా బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్

వీవీప్యాట్స్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లను పకడ్బందీగా ర్యాండమైజేషన్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్లకు ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ భవాని, ఈవీఎంల మేనేజర్ శ్రీదేవి, వివిధ రాజకీయ పార్టీల నేతలు అట్లూరి శ్రీనివాసులు, భాస్కర్, గంగరాజు, ఉదయ్‌కుమార్, సురేంద్రకుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఐదు విడతల్లో 1,500 ఫోన్ల రికవరీ: ఎస్పీ



స్వాధీనం చేసుకున్న ఫోన్లు - బాధితురాలికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఏప్రిల్ 12: చాట్‌బాట్ ద్వారా జిల్లా పోలీసులు మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. నాలుగు విడతలుగా 1,200 ఫోన్లను రికవరీ చేయగా, తాజాగా ఐదో విడతలో 300 రికవరీ చేసి బాధితులకు అందించారు. శుక్రవారం బాధితులకు ఫోన్లను పోలీసులు అతిథి గృహంలో ఏఎస్పీ ఆరిఫుల్లాతో కలిసి ఎస్పీ మణికంఠ చందోలు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు ఇంట్లో నుంచే పోలీసు వారిని చాట్‌బాట్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. ఫోన్లను రికవరీ చేయడంలో కృషి చేసిన క్రైమ్ సీఐ రామాంజినేయులు, చాట్‌బాట్ బృంద సభ్యులు బాపూజి, రఘురామన్, శ్రీనివాసన్, బ్రహ్మారావులను ఎస్పీ అభినందించారు.

చాట్‌బాట్‌కు ఫిర్యాదు చేయడమిలా..

మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారు ముందుగా 94409 00004 వాట్సాప్ నెంబరుకు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి. ఆ తర్వాత వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీసు పేరున ఓ లింకు వస్తుంది. అందులో గూగుల్ ఫార్మేట్ ఓపెన్ అవుతుంది. అందులో జిల్లా, పేరు, వయస్సు, తండ్రి, చిరునామా, కాంటాక్టు నెంబరు, మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబరు, మిస్ అయిన ప్లేస్ వివరాలను సబ్మిట్ చేసిన వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది.

ఫలించిన పవన్ భేటీ

● చల్లబడ్డ టీడీపీ నేతలు - ఆరణి శ్రీనివాసులుతో కలసి పనిచేయండి... మీ కష్టాన్ని వృధా కానివ్వమంటూ భరోసా

● మరో దశాబ్దంపాటు చంద్రబాబుతో కలిసి నడవాలని వుందన్న జనసేనాని



పవన్‌తో సుగుణమ్మ, ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు

తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తిరుపతి టీడీపీ నేతలతో జరిపిన భేటీ ఫలించింది. దాదాపు గంటపాటు ఆయన సుదీర్ఘంగా మాట్లాడిన తీరుతో టీడీపీ ముఖ్యనాయకులు చల్లబడ్డారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలిసి పనిచేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు.తిరుపతి అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థిగా జనసేన తరఫున ఆరణి శ్రీనివాసులును ప్రకటించి మూడు వారాలు కావస్తున్నా..ఇంకా కొందరు అలకపాన్పు దిగకపోవడంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టిసారించారు.శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో తిరుపతికి చేరుకున్నారు.తిరుచానూరు సమీపంలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్లో కూటమి పార్టీలతో విడివిడిగా మాట్లాడారు. ముందుగా టీడీపీకి చెందిన 30 మంది ముఖ్యనేతలతో ఆయన భేటీ అయ్యారు. 'ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం టీడీపీ అధినేత చంద్రబాబు , నేనూ కలిసి తీసుకున్న నిర్ణయం. ఆయన టికెట్ కోసం పార్టీలో చేరలేదు. చేరిన తర్వాతే టికెట్ ఇస్తామని చెప్పాం. అతను నాన్ లోకల్ అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. స్థానికేతరుడు ఎందుకవుతారు? టీడీపీ, ప్రజారాజ్యం పార్టీలకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. చంద్రబాబుకు బాగా సన్నిహితుడు. తిరుపతిలో సొంత ఇల్లు కూడా ఉంది. కాంట్రాక్టర్‌గా తిరుపతిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. కలసి పనిచేయండి. ఫలితాల తర్వాత మీకష్టాన్ని వృధాకానివ్వం' అంటూ రెండు చేతులు జోడించి విజ్ఞప్తి చేయడంతో అసమ్మతి నేతలు సైతం కాసేపు ఆలోచనలో పడి కలిసి పనిచేయడానికి అంగీకరించారు. టీడీపీ ఇంచార్జి సుగుణమ్మ కష్టం కూడా అందరికీ తెలుసునని, గత ఎన్నికల్లోనే ఆమె గెలిచారని, ఆమెకు ఏమి చేయాలో చేస్తామని హామీ ఇచ్చారు. ఆమెతో మళ్లీ ప్రత్యేకంగా మాట్లాడతానన్నారు. ఆరణి శ్రీనివాసులు గెలుపుకన్నా అరాచక శక్తుల ఓటమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టిన క్రమంలో.. అమెరికా అధ్యక్షులను ఏపీకి తీసుకొచ్చిన వ్యక్తి అలా జైలుగోడల మధ్య ఉండడం చూసి తాను చలించిపోయానన్నారు. కష్టకాలంలో అండగా ఉండాలని బేషరతుగా అక్కడే మద్దతు ప్రకటించానని, ఆ తర్వాత బీజేపీ నేతలు నరేంద్ర మోదీ, అమిత్ షాలతో మాట్లాడి కూటమిలో టీడీపీని చేర్చేందుకు కీలకంగా పనిచేశానన్నారు. తాను 45 సీట్లు అడిగితే 24 సీట్లకు తగ్గాల్సి వచ్చిందని, బీజేపీ వాళ్ల కోసం మరో 3 వదులుకుని 21 సీట్లకే పరిమితమయ్యానన్నారు. కేంద్రంలో బీజేపీ, ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తాయని సర్వేలన్నీ చెబుతున్నాయని, కేంద్ర సహకారం కావాలంటే బీజేపీ అవసరమనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దశాబ్దకాలం పాటు దార్శనికుడైన చంద్రబాబుతో కలిసి నడవాలనుకుంటున్నానని స్పష్టం చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ తాను అనకాపల్లి టికెట్ ఆశించి నెల రోజులు ప్రచారం చేశానని...పొత్తులో భాగంగా వేరేవాళ్లకు ఇవ్వాల్సి రావడంతో తప్పుకున్నానన్నారు. ఈ భేటీలో ఎన్వీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్ , ఆర్సీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ.. నీకూ జగన్‌కీ ఇవే తుది ఎన్నికలు

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 12: జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డికీ, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికీ ఇవే తుది ఎన్నికలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. తనకు ఇవే ఆఖరి ఎన్నికలంటూ పెద్దిరెడ్డి పేర్కొన్నదాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆయన పలమనేరులో మీడియాతో మాట్లాడారు. 'మళ్లీ ఎన్నికల్లో పోటీచేసేందుకు పెద్దిరెడ్డికి వయస్సు లేదు. ఇక జగన్‌రెడ్డిని ప్రజలు ఒప్పుకోరు. ఇద్దరికీ 2024 చివరి ఎన్నికలు అవుతాయి' అని అమరనాథరెడ్డి వ్యాఖ్యానించారు. పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల గురించి మంత్రి మాట్లాడారంటూ తన తండ్రి పుంగనూరు నియోజకవర్గ రాజకీయాల్లో ఉన్నారని, తన తాత జిల్లా బోర్డు సభ్యుడిగా పనిచేశారని, కుటుంబాల గురించి మాట్లాడాల్సి వస్తే చాలా ఉందన్నారు. కానీ తాను విజ్ఞతతో వాటి జోలికి వెళ్లడం లేదన్నారు. పెద్దిరెడ్డి రెండు పర్యాయాలు మంత్రిగా చేసిన దానికంటే తాను కేవలం 18 నెలల వ్యవధిలో నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధే ఎక్కువన్నారు. పలమనేరు- కల్లుపల్లి రోడ్డు గురించి పెద్దిరెడ్డి మాట్లాడారని, తాను 22 నెలల వ్యవధిలో ఈరోడ్డును విస్తరించడం జరిగిందన్నారు. పెద్దిరెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో పుంగనూరులోని పుంగమ్మ చెరువు కట్టపైకి వెళ్లి నిలబడితే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. 'పెద్దపంజాణిలో 10 వేల మెజారిటీ వస్తుందని పెద్దిరెడ్డి చెప్పిన మాట నిజం. కాకపోతే ఆ మెజారిటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నాకు వచ్చేది' అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడు మేడికుర్తి ప్రాజెక్టుకు వేసిన టెండరు ఆమోదం పొందకపోతే ఆదికేశవులు నాయుడిని తీసుకొచ్చి చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి ఆ ప్రాజెక్టుతో ఆర్థికంగా ఎదిగిన పెద్దిరెడ్డి కూడా చౌకబారుగా తనగురించి మాట్లాడితే ఎలా అన్నారు.

కర్ణాటక మద్యం, నాటుసారాపై నిఘా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 12: కర్ణాటక సరిహద్దు నుంచి అక్రమంగా తరలి వస్తున్న కర్ణాటక మద్యం, గ్రామాల్లో తయారవుతున్న నాటుసారాపై నిఘా పెంచి ఉక్కుపాదం మోపాలని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య సూచించారు. శుక్రవారం మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని చీకలబైలు, రామసముద్రం మండలం, బి.కొత్తకోట మండలం తానా చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఈబీ ఏఈఎస్ కార్యాలయంలో మదనపల్లె, వాల్మీకి పురం, పీలేరు ఎస్ఈబీ సీఐలతో పాటు, డీటీఎఫ్ ఎస్ఐతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతేడాది డిసెంబరు 26 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని ఎనిమిది ఎస్ఈబీ స్టేషన్‌లు, రెండు డీటీఎఫ్ సిబ్బంది, చెక్‌పోస్టుల్లో దాడులు చేసి నాటుసారా తరలిస్తు, విక్రయిస్తున్న వారిపై 145 కేసులు నమోదు చేసి 126 మందిని అరెస్టు చేసి 2,795 లీటర్ల నాటుసారా, 32 ద్విచక్రవాహనాలు సీజ్ చేశామన్నారు. అలాగే కర్ణాటక, గోవా, తెలంగాణ నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 1,293 లీటర్ల ఎన్‌డీపీఎల్ మద్యంను సీజ్ చేసి 163 కేసులు నమోదు చేసి 197 మందిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసుల్లో 44 వాహనాలను సీజ్ చేశామన్నారు. దీంతో పాటు ఆంధ్ర మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి బెల్టు దుకాణాలకు తరలిస్తున్న వారిపై 434 మందిని అరెస్టు చేసి, ఆరు వాహనాలు సీజ్ చేశామన్నారు. సమావేశంలో సీఐలు ఎ.రమేశ్‌రెడ్డి, సునంద, శ్యామ్ కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ములకలచెరువులో: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం నిల్వలపై దాడులు ముమ్మరం చేయాలని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ములకలచెరువు ఎస్ఈబీ స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా స్థావరాలు, కర్ణాటక మద్యం విక్రయాలపై దాడుడు తీవ్రతరం చేయాలన్నారు.



పీటీఎం చెక్ పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈబీ డీసీ

పాత నేరస్థులను బైండోవర్ చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్ఐ వెంకటేషం తదితరులు ఉన్నారు.

పెద్దతిప్పసముద్రంలో :ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక సరిహద్దులో ఉన్న పోలీసు సిబ్బంది అలసత్వం వహిస్తే క్రమ శిక్షణ చర్యలు తప్పవని ఎస్ఈబీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పీటీఎం మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టు అంకాలమడుగు చెక్‌పోస్టులో పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం చెన్నరాయునిపల్లె మీదుగా కర్ణాటక చిలకలనేర్పు వద్ద గల కర్ణాటక చెక్ పోస్టును తనిఖీ చేసి కర్ణాటక పోలీసులతో ఏపీలో ఎన్నికలు ఉన్నందున సహకరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములకలచెరువు సర్కిల్ పరిధిలోని నాటుసారా స్థావరాలు, కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు తీవ్రతరం చేసి పాతనేరస్థులను బైండోవర్ చేయాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌ను ఆదేశించారు. ఆయన వెంట ములకలచెరువు ఎస్ఈబీ ఇన్స్‌స్పెక్టర్ రామ్మోహన్‌తోపాటు ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బార్‌కు అక్రమంగా మద్యం తరలింపు

- ఎస్ఈబీ దాడుల్లో బయటపడిన వైనం
- ఇద్దరు సేల్స్‌మెన్‌తో పాటు మరో ఇద్దరు అరెస్టు


పట్టుబడిన ఆంధ్ర మద్యంను సీజ్ చేసిన ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 12: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సేల్స్‌మెన్లే అక్రమంగా ఆంధ్ర మద్యాన్ని బార్లకు, బెల్టు షాపులకు తరలిస్తూ ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులు జరిపిన దాడుల్లో పట్టుబడ్డారు. వారి విచారణలో విస్మయపరిచే అంశాలు బయటపడ్డాయి. ప్రభుత్వ మద్యం దుకాణంలో ఒక్కో వ్యక్తికి కేవలం మూడు బాటిళ్లు మాత్రమే మద్యం విక్రయించాలని నిబంధనలు వున్నాయి. అది కూడా ప్రతి బాటిల్‌పై వుండే కోడ్‌ను స్కానింగ్ చేసిన తరువాతే విక్రయించాల్సి వుంది. కాని పట్టణంలోని బసినికొండ ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న జి.శివయ్య(38) గురువారం రాత్రి ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఆటోలో 11 కేసుల ఆంధ్ర మద్యంను పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ బార్‌కు తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్ఈబీ, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. కె.శివశంకర్‌ను అరెస్టు చేయగా, ఇదే ఆటోలో వస్తున్న చంద్రశేఖర్ పారిపోయాడు. ఆటోలో తనిఖీ చేయగా రూ.1.01లక్షల విలువ చేసే ఆంధ్ర మద్యం పట్టుబడింది. దీంతో పారిపోయిన వ్యక్తి ఆచూకి తీయగా అతను ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ బార్‌లో పనిచేస్తున్న వ్యక్తిగా ఎస్ఈబీ అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి విచారణ చేసిన నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు. అలాగే పుంగనూరు మండలం ఈడిగపల్లెకు చెందిన కె.కిరణ్(38) ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన చందుకుమార్(26) వీరిద్దరు ద్విచక్రవాహనంలో 9 బాటిళ్ల ఆంధ్ర మద్యాన్ని తరలిస్తుండగా అమ్మచెరువు మిట్ట వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో ఎస్ఈబీ అధికారులు అరెస్టు చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణంలో పనిచేస్తున్న సేల్స్‌మెన్ తిన్నింటి వాసాలు లెక్కించగా, ఎస్ఈబీ అధికారులు వారిని అరెస్టు చేశారు.

ఎన్నికల తరువాతే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 12: మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఎన్నికల తరువాతే పరిష్కారానికి వీలుంటుందని హయ్యర్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ పి.బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీని తనిఖీ చేసిన ఆయనను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. బీటీకళాశాలను ప్రభుత్వ పరం చేసినప్పటి నుంచి తమకు వేతనాలు సరిగ్గా అందడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలులోకి రాలేదన్నారు. అంతే కాకుండా రెండు నెలలుగా తాము విధుల్లోకి వస్తున్నా హాజరు నమోదు చేయడం లేదని వాపోయారు. దీనిపై ఆర్‌జే డీ మాట్లాడుతూ బీటీ కళాశాలలో ప్రస్తుతం వున్న బోధన, బోధనేతర సిబ్బంది(అవుట్‌సోర్సింగ్) అవసరానికి మించి ఎక్కువ మంది ఉన్నారని, వారందరిని వేరే చోట బదిలీ చేసి పని కల్పించాకే వారి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆనందరెడ్డికి పలు అంశాల పై సూచనలిచ్చారు. ఫైనలియర్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్, వచ్చే విద్యాసంవత్సరానికి అవసరమైన కొత్త కోర్సులపై నివేదికలు పంపాలన్నారు. సెమిస్టర్ విధానంపై విద్యార్థులకు ఎఫెక్టివ్‌గా బోధనలు అందించాలని సూచించారు.

హార్సిలీహిల్స్‌ను సందర్శించిన టూరిజం ఈడీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 12: బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను పర్యాటకశాఖ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఎల్ మల్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. హిల్స్‌పై రూ.14 కోట్లతో జరుగుతున్న ఏపీ టూరిజం అతిథి గృహ సముదాయాల ఆధునికీకరణ పనులను పరిశీలించారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడి సంచరించే ప్రదేశాలను తిలకించారు. హిల్స్‌పై ప్రైవేటు రెస్టారెంట్లకు దీటుగా ఓ అత్యాధునిక రెస్టారెంట్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. పర్యాటకులను ఆకట్టుకునే కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. చీఫ్ ఇంజనీర్ సీఎస్ఎన్ మూర్తి, టూరిజం మేనేజర్ ఎస్.సాల్విన్‌రెడ్డిలు వున్నారు.

రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా శివకుమార్

కురబలకోట, ఏప్రిల్ 12: రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా మోడం శివకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం యువత పని చేయనున్నట్లు పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధాన క్యాదర్శి అయూబ్ బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, అరుణ్‌తేజ, ప్రణయ్, నాగరాజ, వెంకటేష్, ఆది, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు బహుమతులు

మదనపల్లి అర్బన్, ఏప్రిల్ 12: ఆర్టీసీ రీజియన్‌లో మదనపల్లె వన్ డిపో మొదట స్థానంలో నిలిపిన ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు వన్ డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. శుక్రవారం జరిగిన అభినందసభ లో మార్చి నెలలో అత్యుతమ ప్రతిభ కనబర్చిన పీవీ గోపాల్, పీవీ రమ, పి శారద కండెక్టర్లను అభినందించారు. అధిక ఈకేపీ సాధించిన ఎల్లప్ప, పీవీ రమన, అనుసూయలను, గ్యారజ్‌లో బెస్ట్ పర్మామెన్స్ చూపిన నాగరాజు, రాజశేఖర్, అధికంగా కెంపీఎల్ సాధించిన డ్రైవర్ రమణను అభినందించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన డైల్ యువర్ డీఎం కార్యక్రమానికి సమస్యలు ఎవ్వరూ తెలపనందుకు ఆనందంగా ఉందన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీకృష్ణారెడ్డి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న కృష్ణారెడ్డి జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ కృష్ణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 12:స్థానిక ఇందిరానగర్‌లోని శ్రీకృష్ణారెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను కనపర్చారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. కృష్ణారెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు ఎస్ మహేంద్ర 985 (బైపీసీ), జివంశీకృష్ణ 980 (ఎంపీసీ), ఎస్ రుషిత్ 976 (బైపీసీ), బి బాలాజీ 976 (ఎంపీసీ), డి. ప్రసన్న 974 (ఎంపీసీ),గాయత్రి 966 (సీఈసీ)లో మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఏపీ వెంకట సాయిదీపక్ ఎంపీసీలో 470కి 465 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో ఎస్. సుఫీయాన్ 470కి 465 కళాశాల ప్రథమ స్థానంలో ఎస్ కావ్యశ్రీ 470కి 463 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, ఆర్ గీతిక 470కి 462 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఎస్ స్పందన 460, ఆర్ ఆదిత్య 460, సాధించారు. బైపీసీలో హరిత 440కి 427, జాహ్నవి 440కి 424 మార్కులు సాధించారు. అలాగే సీఈసీలో మదన్‌మోహన్ 500కి 465 ఎం ఐశ్వర్య 500కి 463, ఎంఈసీలో లావణ్య 500కి 464 ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో వెంకటరెడ్డి సిద్ధార్థ విద్యార్థుల విజయం



విద్యార్థులను అభినందిస్తున్న వెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాల పిన్సిపాల్

ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మదనపల్లె ప్రశాంత్‌నగ ర్‌లోని వెంకటరెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి విజయకేతం ఎగురవే శారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపించి ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఇందులో పి. దౌదీప్‌సాయి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470కి 467 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. బైపీసీలో స్లాహిలా 440కి 432 మార్కులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో లహరి 1000కి 987 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానం నిలిచిందని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. ప్రథమ సంత్సరంలో 25మంది విద్యార్థులు 450పైగా మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నిమ్మనపల్లి, ఏప్రిల్ 12సానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మెదటి, రెండవ సంవత్సరంలో ఈ ఏడాది 80శాతం ఫలితాలు వచ్చినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధాక్రిష్ణ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో విద్యార్థిని సి.సమీరకు బైపీసీలో 1000మార్కులకు గాను 952 మార్కులు, మరో విద్యార్థిని కీర్తిబాయ్ 1000కి గానూ 935 మార్కులు పాదించినట్లు తెలిపారు. అదే విధంగా మోడల్ స్కూల్ లో ఎంపీసీ చదువుతున్న విద్యార్థిని హారికకు 1000కి గాను 924మార్కులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ఉత్తీర్ణ శాతం 90శాతమని పేర్కొన్నారు. కస్తూరిబా పాఠశాల విద్యార్థిని నౌషిదాకు 1000 గాను 825 మార్కులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ తెలిపారు. 77శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎస్.సానియా 401 మార్కులు, ఎంఈసీ గ్రూపులో సి.మానసా 469, బైపీసీలో ఎస్.నస్రీన్ 369, సీఈసీలో బి.మహేష్ నాయక్ 344 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం ఎంపీసీలో జి.సంధ్య 903, సీఈసీలో జి.చెంచమ్మ 833, ఎంపీసీలో కే.స్నేహితారెడ్డి 887 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 62 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 25 మంది, రెండో సంవత్సరంలో 49 మంది పరీక్ష రాయగా 30 మంది పాసై 61శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా, సెకండియర్‌లో ఎంపీసీలో కిరణ్మయి 914 మార్కులు సాధించిందన్నారు.. పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈవో త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాళ్లు హేమంత్‌కుమార్, సాయిశంకర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో బాలికలు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్‌లో వై. అనుషా470 మార్కులకు గానూ 370 మార్కులు బైపీసీ గ్రూప్‌లో జె. శశికళ 440 మార్కులకు గానూ 425 మార్కులు, సీఈసీలో ఎన్. భవిత 500 మార్కులకు 383 మార్కులు సాధించింది. అదే విధంగా ద్వితీయ సంవత్సరంలో జె. హరిత 1000 మార్కులకు 916 మార్కులు, బైపీసీలో ఎం. ద్విచైత్ర1000 మార్కులకు 823 మార్కులు సీఈసీలో డి. కీర్తన 1000 మార్కులకు 635 మార్కులు సాధించిందన్నారు.

కలకడలో కలకడ మండల కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 32 మందికిగాను 28 మంది, ప్రథమ సంవత్సరంలో 28 మందికి గానూ 27 మంది, అలాగే అదర్శ పాఠశాల్లో ద్వితీయ ఇంటర్ లో 67 మందికి గానూ 49 మంది, ఫస్ట్ ఇయిర్ 74 మంది 49 మంది ఉత్తీర్ణత సాధిం చినట్లు తెలిపారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మోడల్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 92 మంది విద్యార్థులు గాను 66 మంది , సెకండ్ ఇయర్‌లో 117 మంది విద్యార్థులకు గాను 110 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్ తెలిపారు. కలిచెర్ల జూనియర్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ 88 మంది గాను 60 మంది సెకండ్ ఇయర్‌లో 62 మంది విద్యార్థులకు గాను 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సిద్ధవరం కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 28 మంది సెకండ్ ఇయర్ లో 10కి 10 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో రాణి కుమారి వెల్లడించారు.

మద్యం అమ్మకాల లక్ష కోట్లు లూటీ చేసిన జగన్

- పీలేరులోని కూటమి నేతల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

పీలేరు, ఏప్రిల్ 12: రాష్ట్రంలో జరుగుతున్న మద్యం అమ్మకాల ద్వారా ఇప్పటి వరకు ముఖ్యమంత్రి జగన్ సుమారు లక్ష కోట్లు లూటీ చేశారని పీలేరుకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఆరోపించారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో కూటమి నాయకులు మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 'జే' బ్రాండ్లు ప్రవేశపెట్టిన జగన్ సర్కారు మద్యం అమ్మకాలపై వస్తున్న వాస్తవిక ఆదాయాన్ని దాచి పెట్టేందుకే డిజిటల్ పేమెంట్లు లేకుండా చేసిందని ఆరోపించారు. రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి మాట్లాడుతూ దేశమంతటా బహుళ జాతి సంస్థలు తయారు చేసి మేలు రకం మద్యం అందుబాటులో ఉంటే ఏపీలో మాత్రం వైసీపీ నాయకుల డిస్టలరీల్లో తయారయ్యే నాసిరకం బ్రాండ్లు విక్రయిస్తున్నారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కలప రవి మాట్లాడుతూ దశల వారీగా మద్య నిషేధం తెస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి, వచ్చే 20 ఏళ్లలో లభించే మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకోవడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు పురం రామ్మూర్తి, వసంతాల రాజా, పోలిశెట్టి సురేంద్ర, బాజ్జీ, శివారెడ్డి, రెడ్డిముని, పురుషోత్తం రెడ్డి, అత్తార్ చాన్ బాషా, షౌకత్ అలీ, హనీఫ్, బీజేపీ నాయకులు వెంకటరమణ, జనసేన నాయకులు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీధర్

నిమ్మనపల్లి, ఏప్రిల్ 12: నిమ్మనపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీధర్ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. గత కొంత కాలంగా ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాధాక్రిష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి జిల్లా వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిన్సిపాల్ పని చేస్తూ బదిలీపై నిమ్మనపల్లి ప్రభుత్వ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు కూటమి ఆత్మీయ సమావేశం

కలికిరి, ఏప్రిల్ 12: పీలేరు నియోజవర్గానికి సంబంధించి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేశామని పీలేరు ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్డీఏ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు హాజరు కావాలన్ని కోరారు.

బీసీలు బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి


జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, ఏప్రిల్12: రాష్ట్రంలో బీసీలు బాగుపడాలి అంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. శుక్రవారం బి. కొత్తకోట మండలంలోని బీరంగి, గుడిపల్లి పంచాయతీలలో జయహో బీసీ కార్యక్రమం మండల పార్టీ కన్వీనర్ నారాయణస్వామి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ అధినే త చంద్రబాబు బీసీ డిక్లరేష న్ ద్వారా 50 ఏళ్లకే రూ.4వేలు పింఛను, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షన్నరకోట్లు ఖర్చు, రూ.10లక్షల చంద్రన్న బీమా హామీలను ఇవ్వడం జరిగింద న్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా జయచం ద్రారెడ్డిని, రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్‌ఇన్‌చార్జి కనకంటి ప్రసాద్, నాయకులు గంజి మోహన, డేరింగులనారా యణ, చావిడికిట్టన్న, ప్రభాకర్, షఫీవుల్లా, రెడ్డిపీర్,గోపినాథ్, శ్రీరాములు మొటుకుశివ, రెడెప్ప పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

కురబలకోట, ఏప్రిల్ 12: బీసీల సంక్షేమమే టీడీపీ అధినేత చంద్రబాబు ధ్యేయమని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పులగూరవాండ్లపల్లె, తుంగవారిపల్లె తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ఇంటింటా ప్రచారంతో పాటుగా జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం తగ్గించిందని దానిని మళ్లీ పెంచి బీసీ లకు న్యాయం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేసి టీడీపీ గెలుపునకు పాటుప డాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర, మాజీ ఎంపీపీ తిమ్మరాయుడు, వెంకటరమణారెడ్డి, వెంకటశివ, రమణ, నరసింహులు, రమణ, గోపాలకృష్ణ, సదాశివ, తెట్టు ఉపసర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

చంద్రబాబు పథకాలను చూసే టీడీపీలోకి భారీగా చేరికలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 12: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు నచ్చి వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీగా టీడీపీలో చేరుతున్నారని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 32వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు మీడియా కోఆర్డినేటర్ యర్రబల్లి వెంకటరమణారెడ్డి, గంగారపు రామ్మూర్తినాయుడు, వేల్పుల వెంకటేశ్, బొమ్మశెట్టి పురుషోత్తం ఆధ్వర్యంలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి షాజహాన్‌బాషా టీడీపీ కండువాలు వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, దొరస్వామినాయుడు, నాగభూషణ, శ్రీనివాసులు, నాగరాజు, సుధాకర్, ఎం.ప్రభాకర్, కత్తి లక్ష్మన్న, విజయ్‌కుమార్ బావాజాన్, డాన్స్ రెడ్డెప్ప, విజయ్, నరసింహులు, 103వ బూత్ ఇన్‌చార్జి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పథకాలు


బీజేపీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న పొత్తూరి శ్రీకాంత్

కలకడ, ఏప్రిల్ 12:కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాలకు పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కలకడలో ప్రచారరథం ద్వారా ప్రజలకు బీజేపీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పేదలకు లబ్ధిచేకూరే అభివృద్ధి కార్యక్రమాలు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రూపుదిద్దుకొన్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షించి రాజంపేట పార్లమెంట్ బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని పీలేరు అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.మూర్తి, చెన్నమనాయుడు, వెంకటరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి


ములకలచెరువు జయహో బీసీలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి


ములకలచెరువు, ఏప్రిల్ 12: డబుల్ ఇంజన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బురకాయలకోటలో శుక్రవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేనలు అధికారంలో రావాలన్నారు. జగన్ పాలనలో 300 మంది పైగా బీసీలను క్రూరంగా హత్యకు గురయ్యారన్నారు. అలాగే మద్దినాయనిపల్లెలో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో నియోజక వర్గ టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, నియోజకవర్గ అధ్య క్షుడు చెన్నకిష్టా, నాయీ బ్రాహ్మణ జిల్లా సాధికార కన్వీనర్ కేశవులు, రాజంపేట పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తుకూరు మౌళా, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, కేవీ రమణ, పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానని తంబళ్లపల్లి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. తంబళ్లపల్లిలో జయచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గెలిపించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాదరెడ్డి కోరారు. తంబళ్లపల్లి టీడీపీ ఎన్నికల పరిశీలకులు తులసిధర్‌నాయుడు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు శంకర పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని ఎర్రసానిపల్లెలో ఏర్పాటు చేసిన జయహో బీసీ డిక్లరేషన్ సమావేశంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, గ్రామాధ్యక్షుడు సుధాకర్, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర, చలపతినాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన తదితరులు పాల్గొన్నారు.

జగన్ క్షమాపణ చెప్పాకే ఓట్లు అడగాలి

- రాష్ట్రాన్ని 'మద్యమాంధ్రప్రదేశ్'గా మార్చివేశారు!
- నాసిరకం మద్యంతో ప్రజలతో చెలగాటమాడుతున్నారు
- దోపిడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి
- కేవీపల్లె మండలం నూతనకాల్వలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


కిశోర్ సమక్షంలో టీడీపీలో చేరిన పీలేరు వైసీపీ శ్రేణులు

పీలేరు, ఏప్రిల్12: సంపూర్ణ మద్యనిషేధం తెస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక దానిని తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర మహిళలకు ముందుగా క్షమాపణ చెప్పి ఈ ఎన్నికల్లో ఓట్లు అభ్యర్థించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేవీపల్లె మండలం నూతనకాల్వ గ్రామ పంచాయతీలో శుక్రవారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక దశల వారీగా మద్యనిషేధం చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేవలం కొంత మంది తన అనుచరుల కోసం ఇబ్బుడిముబ్బుడిగా డిస్టలరీలు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని 'మద్యమాంధ్రప్రదేశ్'గా మార్చివేశారన్నారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన మద్యం పాలసీలను పూర్తిగా మార్చి వేసి తమ పార్టీ నేతల డిస్టలరీల్లో తయారు చేసిన బ్రాండ్లనే విక్రయించడమే కాకుండా అధిక ధరలకు అమ్ముకుంటూ ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న అధికార పార్టీ నేతలు గ్రామాల్లో ఇబ్బుడిముబ్బుడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రశాంతత లేకుండా బెల్టు షాపులపై ప్రశ్నించిన గ్రామస్తులను బెదిరించడమే కాకుండా భౌతిక దాడులకు కూడా పాల్పడుతున్నారన్నారు. మద్యం అంశంలో జగన్ వైఖరిని రాష్ట్రంలోని మహిళలందరూ గమనించాలని, తమను నమ్మించి మోసం చేసిన ఆయనకు త్వరలో జరగనున్న ఎన్నికల్లో తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలలని ఆయన పిలుపునిచ్చారు. పీలేరు నియోజకవర్గానికి జీవనాడి లాంటి అడవిపల్లె ప్రాజెక్టును ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. అడవిపల్లె ప్రాజెక్టు పూర్తయి ఉంటే పీలేరు నియోజకవర్గంలోని సుమారు 70 వేల ఎకరాలకు సాగు నీరు అందేదన్నారు. తన అన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు కేవీపల్లె మండలం ఝరికోన వద్ద ప్రాజెక్టు నిర్మించి కలకడ, కేవీపల్లె, కలికిరి మండలాలకు శాశ్వత తాగునీరు అందించే ప్రాజెక్టు నిర్మించామని గుర్తు చేశారు. అనంతరం ఆయన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారానికి తమ గ్రామానికి వచ్చిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి నూతనకాల్వ గ్రామస్తులు, కేవీపల్లె మండల టీడీపీ, జనసేన శ్రేణులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మాపురం రఘన్న, సూర్య ప్రకాశ్ రెడ్డి, గీతాంజలి, గాలి సుధాకర్ నాయుడు, కేవీ రమణారెడ్డి, సంఘం శివారెడ్డి, వెంకటేశ్వర చౌదరి, ప్రసాద్ రెడ్డి, బుజ్జిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కండక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో కేవీపల్లె మండలం చీనేపల్లె, వడ్లకుంట గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎంపీపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ కేవీ రమణారెడ్డి నేతృత్వంలో చీనేపల్లెకు చెందిన 50 కుటుంబాలు, వడ్లకుంటకు చెందిన వైసీపీ నాయ కుడు ఆనంద్ రెడ్డి, ఆ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరా యి. వారందరికీ కిశోర్ కుమార్ రెడ్డి పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పీలేరు పట్టణంలోనూ శుక్రవారం సుమారు 100 మంది యువకులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. పీలేరు పట్టణానికి చెందిన సాయిరాం వీధి, సైనిక్ నగర్, కావలిపల్లె ప్రాంతాలకు చెందిన రియాజ్, పర్వతాల మల్లిఖార్జున, బత్తల నాగేశ్వర రావు తమ అనుచరులు, సోద రులతో కలిసి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పీలేరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వారందరినీ కిశోర్ కుమార్ రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పెద్ద ఎత్తున పార్టీలోకి చేర్పిన బోడుమల్లువారిపల్లె మాజీ సర్పంచ్ సూరిని కిశోర్ అభినందించారు.